RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 263 మేడ్చల్ మల్కాజ్‌గిరి 16 అక్టోబర్ 2024 బుధవారం పేజీలు : 4

## ఇస్రో ఛైర్మన్‌కు 'ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డు'

న్యూఢిల్లీ, : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఛైర్మన్ డాక్టర్ ఎస్.సోమనాథ్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రతిష్ఠాత్మక 'ఐఏఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డు-2024'ను ఆయన అందుకున్నారు. గత ఏడాది చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో సాధించిన విజయానికి గుర్తుగా అంతర్జాతీయ ఆస్ట్రోనాటికల్ ఫెడరేషన్ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ కార్యక్రమం ఇటలీలోని మిలాన్ నగరంలో జరిగింది. ఈ అవార్డు అంతరిక్ష పరిశోధనల్లో భారతదేశ కీలక భాగస్వామ్యాన్ని చెబుతోందని ఇస్రో సోషల్ మీడియాలో పేర్కొంది. చంద్రయాన్-3 ద్వారా ఇస్రో సాధించిన విజయంపై ఐఏఎఫ్ ప్రశంసలు కురిపించింది. ఈ మిషన్ శాస్త్రీయ ఉత్సుకత, వ్యయ-సమర్థవంతమైన ఇంజనీరింగ్ సమ్మేళనానికి ఉదాహరణగా నిలిచిందని పేర్కొంది.




# పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో కలిసి ముందుకెళ్లాలి

## దామగుండం రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

హైదరాబాద్: పార్టీలు వేరైనా దేశాభివృద్ధిలో అందరూ కలిసి ముందుకెళ్లాలని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం రిజర్వు ఫారెస్టులో రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ఏర్పాటు చేసిన సభలో రక్షణ మంత్రి ప్రసంగించారు.

అబ్దుల్ కలాం జయంతి నాడు వీఎల్ఎఫ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రాజెక్టుకు ఏర్పాటుకు అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రక్షణరంగ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు గొప్ప పేరుందని, దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకంగా మారిందన్నారు. దేశ భద్రత విషయంలో వీఎల్ఎఫ్ పాత్ర కీలకమన్నారు. కమ్యూనికేషన్ విషయంలో ఈ కమాండ్ సెంటర్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. "కమ్యూనికేషన్ విషయంలో భవిష్యత్తు దిశగా అడుగులు వేయాలి. సాంకేతికయుగంలో కమ్యూనికేషన్ అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. కమ్యూనికేషన్ రంగంలో పావురాలు, గుర్రాల నుంచి ఇక్కడి వరకు వచ్చాం. తపాలా వ్యవస్థను అనేక ఏళ్లుగా వినియోగించుకున్నాం. ఇప్పుడంతా ఇంటర్నెట్ యుగం.. సమాచారం క్షణాల్లో చేరుతోంది. సమాచార విప్లవం.. ఇవాళ అనేక దేశాలను దగ్గర చేస్తోంది. విద్య, వైద్య రంగాల్లో కీలకపాత్ర పోషిస్తోంది. ఇంట్లో కూర్చునే అనేక కోర్సులు నేర్చుకునే అవకాశం వచ్చింది. వీఎల్ఎఫ్‌కు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. నావికారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవడం అనివార్యం. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పుష్కలంగా ఖనిజ సంపద ఉంది. సముద్రంపై ఆధిపత్యం సాధించిన వాళ్లే మరింత అభివృద్ధి చెందుతారు. సముద్రంపై ఆధిపత్యం ఆంగ్లేయుల విస్తరణకు ఎంతో ఉపయోగపడింది. అత్యాధునిక పరికరాల ద్వారా రక్షణరంగాన్ని బలోపేతం చేస్తాం. దేశ రక్షణ విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ పడబోము. దేశ రక్షణ, భద్రత విషయంలో ఎలాంటి ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గం. వీఎల్ఎఫ్ వల్ల స్థానికులపై ఎలాంటి చెడు ప్రభావం ఉండదు. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి" అని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు.

**దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం.. చేయనివ్వం: రేవంత్‌రెడ్డి...** దేశ భద్రత విషయంలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాడార్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం పాల్గొని ప్రసంగించారు. "మన పార్టీలు వేరు కావొచ్చు.. సిద్ధాంతాలు వేరు కావొచ్చు. దేశ భద్రత, రక్షణ విషయంలో మేం ఎప్పుడూ మీతో కలిసి వస్తాం. దేశ రక్షణ పరికరాల తయారీలో హైదరాబాద్‌కు మంచి పేరుంది. వీఎల్ఎఫ్ ఏర్పాటుకు అత్యంత వ్యూహాత్మక ప్రాంతం వికారాబాద్ జిల్లా. కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తూ వివాదాలకు తెరలేపుతున్నారు. దేశ భద్రత ప్రాజెక్టులకు రాజకీయం చేయడం సరికాదు. ఈ ప్రాజెక్టుకు భారాస ప్రభుత్వం అన్ని అనుమతులు ఇచ్చింది. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయనివ్వం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## ప్రైవేటు భవనాలకు అద్దె బకాయిలు విడుదల చేయాలి: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: గురుకుల పాఠశాలలు కొనసాగుతున్న ప్రైవేటు భవనాలకు వెంటనే అద్దె బకాయిలు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. అద్దె భవనాల యజమానులతో మాట్లాడి అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు గురుకుల సొసైటీల కార్యదర్శులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గురుకులాల కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించి రోజూ ఒక పాఠశాలను



పరిశీలించాలని స్పష్టం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా గురుకుల విద్యార్థులకు మెస్ ఛార్జీలను ఎప్పటికప్పుడు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినందున.. సంబంధిత అధికారులు సమావేశమై మెస్, కాస్మొటిక్స్, ట్యూటర్ల ఛార్జీల పెంపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణరావు, విద్య, ఆర్థిక శాఖల ముఖ్యకార్యదర్శులు బుర్రా వెంకటేశం, సందీప్ కుమార్ సుల్తానియా, గురుకుల సొసైటీల కార్యదర్శులు సైదులు, తఫ్సీల్ ఇక్బాల్, సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల




దిల్లీ: దేశంలోని మరో రెండు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ పోలింగ్ తేదీలు, ఇతర వివరాలను మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రలో ఒకే దశలో, ఝార్ఖండ్‌లో రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మహారాష్ట్రలో నవంబర్ 20 (బుధవారం)న పోలింగ్ జరగనుండగా.. ఝార్ఖండ్‌లో నవంబర్ 13, 20 తేదీల్లో ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 23న చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు...** అలాగే, దేశ వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లోక్‌సభ, 48 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. కేరళలోని వయనాడ్, మహారాష్ట్రలోని నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గాలతో పాటు వేర్వేరు రాష్ట్రాల్లో 48 అసెంబ్లీ సీట్లకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు.

వయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంతో పాటు 47 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న, నాందేడ్ లోక్‌సభ సీటుతో పాటు ఉత్తరాఖండ్‌లోని ఒక అసెంబ్లీ స్థానానికి నవంబర్ 20న పోలింగ్ నిర్వహించి నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

**మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్ :** గెజిట్ నోటిఫికేషన్ జారీ: అక్టోబర్ 22, నామినేషన్ల స్వీకరణకు తుది గడువు : అక్టోబర్ 29, నామినేషన్ల పరిశీలన: అక్టోబర్ 30, నామినేషన్ల ఉపసంహరణ గడువు: నవంబర్ 4, పోలింగ్ తేదీ : నవంబర్ 20, ఓట్ల లెక్కింపు: నవంబర్ 23.

"మహారాష్ట్రలో 36 జిల్లాల్లో మొత్తం 288 నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో 234 జనరల్ సీట్లు కాగా.. 25 ఎస్టీ, 29 ఎస్సీ స్థానాలు ఉన్నాయి. 2024 అక్టోబర్ 15 నాటికి మొత్తంగా 9.63 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. వీరిలో 4.97 కోట్ల మంది పురుషులు, 4.66 కోట్ల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలాగే, 1.85 కోట్ల మంది 20-29 ఏళ్ల లోపు వారు కాగా.. 20.93లక్షల మంది తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎన్నికల కోసం 1,00,186 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి " అని కమిషనర్ తెలిపారు.

**ఝార్ఖండ్ ఎన్నికల షెడ్యూల్..** ఝార్ఖండ్‌లో 24 జిల్లాల్లో 81 నియోజకవర్గాలు ఉండగా.. వీటిలో జనరల్ 44 సీట్లు కాగా, ఎస్టీ 28, ఎస్సీ 9 చొప్పున ఉన్నాయి. మొత్తంగా 2.6 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1.29 కోట్ల మంది మహిళా ఓటర్లు.. 1.31 కోట్ల మంది పురుషులు, 66.84లక్షల మంది యువ ఓటర్లు కాగా.. 11.84 లక్షల మంది తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. మొత్తం 288 మంది శాసన సభ్యులు ఉన్న మహారాష్ట్ర ప్రస్తుత అసెంబ్లీకి ఈ ఏడాది నవంబరు 26తో గడువు ముగియనుంది. అలాగే, 81 స్థానాలున్న ఝార్ఖండ్ శాసనసభ గడువు వచ్చే ఏడాది జనవరి 5వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం మహారాష్ట్రలో భాజపా, శివసేన, ఎన్సీపీ పార్టీలతో ఏర్పాటైన 'మహాయుతి' సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. ఝార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ పక్షాలతో కూడిన ప్రభుత్వం కొనసాగుతోంది.

# రాజకీయాలకతీతంగా అభివృద్ధికి సహకరిస్తాం: సీఎం రేవంత్

వికారాబాద్: రాజకీయాలకతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పని చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో అతిపెద్ద రాడార్ స్టేషన్ గా పూడూరు మండలంలో ఏర్పాటు చేసిన కేంద్రం నిలుస్తుందని సీఎం అన్నారు.
వికారాబాద్ జిల్లా పూడురు మండలంలో భారత నేవీ ఏర్పాటు చేస్తోన్న రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాడార్ స్టేషన్ కు భూమిపూజ చేసిన అనంతరం సీఎం మాట్లాడుతూ.. దేశ రక్షణలో తెలంగాణ భాగస్వామ్యం కీలకమన్నారు. "హైదరాబాద్ దేశ రక్షణకు సంబంధించి కీలకమైన నగరం. తెలంగాణకు మూడు వైపులా సముద్రం ఉంది. ఇక్కడ వీఎల్ఎఫ్ నిర్మాణంతో సముద్ర ప్రాంతం నుంచి చొరబడే ముష్కరుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ స్టేషన్ తో అనర్థాలు జరుగుతాయని కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేశారు. కానీ తమిళనాడులో 34 ఏళ్లుగా ఉంది.

అక్కడ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దేశ రక్షణ కోసం రాజీపడొద్దనే ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చారు. దేశ రక్షణ విషయంలో రాజకీయాలు చేయం. కేంద్రంతో కలిసి నడుస్తాం. దేశ రక్షణ కోసం పెడుతున్న ప్రాజెక్టులపై రాజకీయం చేసేవారు పునరాలోచించుకోవాలి . రాడార్ స్టేషన్ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఉంటుంది. దేశభద్రత చాలా ముఖ్యం. రాడార్ స్టేషన్ పై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తున్నారు. దేశ రక్షణకు సంబంధించిన విషయాన్ని కూడా రాజకీయం చేయడం తగదు. బీఆర్ఎస్ పదేళ్లు అబద్ధాలు చెప్పింది. ఇప్పుడు దేశ రక్షణకు సంబంధించిన అంశంలో కూడా బీఆర్ఎస్ నేతలు అవే అబద్ధాలు చెబుతున్నారు" అని సీఎం రేవంత్ విమర్శించారు.



## సంపాదకీయం

# టీడీపీతో మెగానుబంధం మరింత స్ట్రాంగ్‌గా !?

ఏపీలో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాజకీయాలు చేస్తోంది. కేవలం ఈ రోజుకు మాత్రమే అని కాకుండా రానున్న కాలాలలో కూడా పసుపు పార్టీ పరిమళాలు అందుకునేలా అధినాయకత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇక తెలుగుదేశం పార్టీ 2024లో తన మొత్తం రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ చేయని ఒక పదునైన వ్యూహాన్ని రచించింది. ఏపీలో బీసీలు టీడీపీకి మొదటి నుంచి పెట్టని కోట. అయితే ఏపీ రాజకీయాల్లో కీలకమైన సామాజిక వర్గంగా ఉన్న కాపులు మాత్రం ప్రతీ ఎన్నికకూ ఒక చాయిస్ ని తీసుకుంటూ ఉంటారు. ఒకసారి వారు టీడీపీని మరోసారి వైసీపీని గెలిపిస్తూ ఉంటారు. గతంలో చూస్తే కాపులు కాంగ్రెస్ కి కట్టుబడిపోయిన అతి పెద్ద ఓటు బ్యాంక్ గా ఉండేవారు. కానీ కాంగ్రెస్ విభజన ఏపీలో లేకుండా పోవడం ప్రాంతీయ పార్టీగా వైసీపీ ఆవిర్భావంతో ఆ పార్టీ వైపు కాంగ్రెస్ ని చూసినంతగా కాపులు చూడకపోవడం వల్ల టీడీపీ పంట పండుతోంది. ఏపీలో 2024 ఫలితాల తరువాత చూస్తే కమ్మలు కాపులు బీసీలు, ఇతర వర్గాల మద్దతు టీడీపీ కూటమిని గణనీయంగా దక్కింది అని చెప్పాల్సి ఉంది. అంతే కాదు అనూహ్యంగా ఎస్టీ ఎస్టీ సెగ్మెంట్లలోనూ టీడీపీ తన పెర్ఫార్మెన్స్ బాగా చూపించింది. మైనారిటీల అభిమానాన్ని కూడా ఈసారి ఎన్నికల్లో టీడీపీ ఎక్కువగా పొందింది. ఇక రెడ్లు కూడా చాలా కాలం తరువాత ఒక గుర్తించతగిన శాతం మేరకు టీడీపీని సపోర్ట్ చేయడం ఇంకో ముఖ్య పరిణమంగా చెబుతున్నారు ఇదంతా రాజకీయ సామాజిక పోలరైజేషన్ వల్ల సాధ్యపడింది. టీడీపీనే ఏపీకి ఆశా కిరణం అన్న లెక్కలతో కూడా సామాజిక బౌండరీలను దాటి మరీ 2024 ఎన్నికల్లో అనేక సామాజిక వర్గాలు మద్దతు ఇచ్చాయి. ఏపీ ఫస్ట్ పాలిటిక్స్ నెక్స్ట్ అన్న స్లోగన్ కూడా చాలా మందిని టీడీపీ వైపు నడిపించింది. అయితే ఇదే పరిస్థితి ఎల్లకాలం ఉండకపోవచ్చు. రాజకీయాల్లో అనేక డైమన్షన్లు ఉంటాయి. అవే గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. పైగా నిన్న ఉన్నట్లుగా నేడు ఉండే చాన్స్ లేదు. దాంతో టీడీపీ అధినాయకత్వం ఇపుడు కొత్త ఆలోచనలు చేస్తోంది అని అంటున్నారు. కూటమిలో బీజేపీ జనసేన ఉంది. ఆ పొత్తును దీర్ఘ కాలం కొనసాగించాలని చూస్తోంది. ఇక పవన్ కళ్యాణ్ వంటి చరిష్మాటిక్ లీడర్ కూటమి వైపు ఉండడం పెద్ద ప్లస్ పాయింట్. పవన్ కూటమిలో ఉన్నంతవరకూ కూటమిని టచ్ చేసే సాహసం ప్రతిపక్షాలు చేయలేవు. ఇపుడు పవన్ కి తోడుగా మెగాస్టార్ చిరంజీవిని తన వైపు తిప్పుకోవడానికి చంద్రబాబు వినూత్నమైన ఆలోచనలు చేస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయానికి మెగాస్టార్ పరోక్షంగా సహకరించారు. సోషల్ మీడియా ద్వారా ఆయన ఇచ్చిన స్టేట్మెంట్స్ ఏపీ ప్రజల మీద పెను ప్రభావం చూపించాయి. టోటల్ మెగా కాంపౌండ్ అంతా టీడీపీ కూటమి విజయం కోసం పనిచేసింది అని కూడా చెప్పుకున్నారు. ఇక టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి ముఖ్యమంత్రి చంద్రబాబుని మెగాస్టార్ చిరంజీవి వెళ్ళి ఆయన ఇంట్లో కలిసారు. కోటి రూపాయల చెక్కుని వరదబాధితులకు సహాయార్ధం అందించాలని ఆయన వచ్చినప్పటికీ ఇద్దరూ అనేక ఇతర విషయాలని కూడా చర్చించుకున్నారు అని ప్రచారంలో ఉంది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించాలని చిరంజీవి ముందు ఒక కీలక ప్రతిపాదనను చంద్రబాబు పెట్టినట్లుగా కూడా ప్రచారం సాగుతోంది. మెగా ఇమేజ్ కలిగిన చిరంజీవికి కోట్లాదిమంది ఆరాధకులు ఉన్నారు. ఆయన నోటి వెంట మాట ఏది వచ్చినా అది శిరోధార్యంగా భావించే వారు ఉన్నారు. దాంతో మెగాస్టార్ సేవలను ప్రభుత్వం ఈ విధంగా వాడుకోవాలని చూస్తోంది అని అంటున్నారు. మెగాస్టార్ హెూదాకు తగిన విధంగా కేబినెట్ ర్యాంక్ కల్పిస్తూ ఆయనకు కీలకమైన పదవిని ఇవ్వాలని కూడా చంద్రబాబు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు. టాలీవుడ్ కి పెద్దగా కూడా చిరంజీవి ఉన్నారు. అజాత శత్రువుగా ఆయన ఉన్నారు. ఆయన ద్వారా ఏపీలో సినీ పరిశ్రమను విస్తరించాలని కూడా ప్రభుత్వానికి ఆలోచనలు ఉన్నాయి. రాజకీయాల్లోకి వచ్చి కేంద్ర మంత్రిగా పనిచేసిన మెగాస్టార్ ఇపుడు అయితే రాజకీయాలను పక్కన పెట్టినట్లుగానే చెబుతారు. అయితే చంద్రబాబు ప్రతిపాదించినట్లుగా జరుగుతున్న ప్రచారం మీద మెగాస్టార్ ఏ నిర్ణయం తీసుకుంటారో అని కూడా అంటున్నారు. అదే కనుక జరిగితే టీడీపీతో మెగానుబంధం మరింతగా గట్టి పడుతుంది అని అంటున్నారు. ఇలా దీర్ఘకాలం మెగానుబంధం స్ట్రాంగ్ గా చేసుకుంటే టీడీపీకి పొలిటికల్ గా బ్రైట్ ఫ్యూచర్ ఉంటుందని కూడా ఆ పార్టీ అధినాయకత్వం ఆలోచిస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ వార్తలలో నిజమెంత ఉందో. రేపటి పరిణామాలు ఎలా ఉంటాయో.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా శ్రీరేణుక ఎల్లమ్మ కళ్యాణం

## అమ్మవారిని దర్శించుకున్న త్రిశక్తి పీఠాధిపతి శ్రీశక్త్యానందగిరిస్వామి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, భక్తులు







శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణం భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 7వ వార్షికోత్సవం లో భాగంగా అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా దేశం కుటుంబ సభ్యులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ఘటం తీసుకువెళ్లారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య అమ్మ వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి సూర్య భవనం సమర్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భం గా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి త్రిశక్తి పీఠాధిపతి శ్రీశక్త్యానందగిరి స్వామి, ఎమ్మెల్యే మల్లారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, వివిధ గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేసి ఎల్లమ్మ అమ్మవారును అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింలు యాదవ్, మాజీ జడ్పిటీసీ అనితలాలయ్య, హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్ది, మాజీ సర్పంచు, వివిధ పార్టీల నాయకులను గౌడ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.

**పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం....**

కాగా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 7వ వార్షికోత్సవం సందర్భంగా గౌడ సంఘం వారు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ఎల్లమ్మ ఆలయానికి వచ్చిన భక్తులు ఎంతో సంతోషంగా అన్న ప్రసాదం స్వీకరించారు.

# అర్హులకు ప్రభుత్వ పథకాలు చేరేలా ఇందిరమ్మ కమిటీలు కృషి చేయాలి

## తూంకుంటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఇందిరమ్మ కమిటీల అవగాహన కార్యక్రమం





శామీర్ పేట, గరుడ వార్త) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాం గ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు చేరేలా గ్రామాల్లో, మున్సిపల్లో రాజకీయాల కతీతంగా వినూత్నంగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మంగళవారం శామీర్ పేట మండలం తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్లో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్ అధ్యక్షతన కాం గ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాల, తూంకుంట మున్సిపల్, జవహర్నగర్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్ విచ్చేసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో వినూత్నంగా ఇందిరమ్మ కమిటీలను రాజకీయాల కతీతంగా, పారదర్శకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న వివిధ పథకాలకు అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి దక్కేలా చేయడమే ప్రభుత్వ ఆశయమన్నారు. ఏలాంటి పొరపాట్లకు, అవకతవకలకు తావివ్వకుండా ఇందిరమ్మ కమిటీల తో ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వం తగు చర్యలను తీసుకుంటుందని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గైడ్లైన్స్ ప్రకారం విలైనంతత్వరగా మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు, మాజీ ప్రజాప్రతినిధులకు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులకు ప్రాధాన్యతనిచ్చి పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మున్సి పాలిటిల్లో, గ్రామాల్లో ఎలాంటి గొడవలకు, ఆవకతవకలకు తావివ్వకుండా సామరస్యంగా ఇందిరమ్మ కమిటీలను వేయాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి దక్కేలా పకడ్బందిగా అమలు చేయడానికే ఇందిరమ్మ కమిటీలను

ప్రభుత్వ పరంగా వేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాల అమలులో అవకతవకులు జరుగకుండా ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో అర్హులైన ప్రజలకు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్, కాం గ్రెస్ పార్టీ నాయకులు ముజీబ్, బాలేష్, శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు, తూంకుంట మ ఎన్సిపల్, జవహర్ నగర్ కార్పోషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీ కర్పోరేటర్లు, కౌన్సిలర్లు, పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అప్పుల కుప్ప.. బకాయిల బండ



హైదరాబాద్: గ్రేటర్‌లో అత్యవసర పనులు తప్ప కొద్ది నెలలుగా ఇతర అభివృద్ధి జరగట్లేదు. కాలనీ రోడ్లు, నాలాలు, పార్కులు, శ్మశానవాటికల అభివృద్ధి, మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం ఇలా చాలా పనులు అటకెక్కాయి. కొన్ని మధ్యలోనే నిలిచిపోయాయి. నాలాల పూడికతీత, నిర్మాణ పనులు సవ్యంగా జరగకపోవడంతో వర్షాకాలం ముంపు తిప్పలు తప్పడం లేదు. జీహెచ్ఎంసీకి సర్కారు నుంచి వేర్వేరు రూపాల్లో రూ. 8వేల కోట్లు రావాలి.

**చిన్నపాటి పనులకూ ఇబ్బందే** జీహెచ్ఎంసీలో 150 మంది కార్పొరేటర్లతో పాలకమండలి, 15 మంది కార్పొరేటర్లతో ఏర్పాటయ్యే స్థాయీ సంఘం ఉంటాయి. స్థాయీ సంఘం వారానికోసారి సమావేశమై రూ. 4కోట్ల విలువైన అభివృద్ధి, నిర్వహణ పనులను ఆమోదిస్తుంది. వాటిని ప్రతి మూణ్నెళ్లకోసారి పాలకమండలి సమావేశం ఆమోదిస్తుంది. 2024 ప్రారంభం నుంచి స్థాయీ సంఘం సమావేశాలు సరిగా జరగట్లేదు. మూడు నెలలు, రెండు నెలల వ్యవధితో జరుగుతున్నాయి.

బడ్జెట్‌లో కేటాయింపులు.. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి తాత్కాలిక పద్దులో జీహెచ్ఎంసీకి రూ. 1100కోట్లు ప్రకటించింది. జులై 26న పూర్తిస్థాయి పద్దులో మరో రూ. 3065 కోట్లు కేటాయించింది. అందులో రూ. 250కోట్లే ఇప్పటివరకు బల్దియాకు అందాయి.

వాయిదాలే సవాలు

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ), జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం, ప్రధాన రోడ్లను ప్రైవేటు సంస్థలకు అప్పగించిన సీఆర్ఎంపీ (సమగ్ర రహదారుల నిర్వహణ) పథకాలకు జీహెచ్ఎంసీ రూ. 6 వేల కోట్లకు పైగా అప్పులు చేసింది. ఈ రుణ వాయిదాలను చెల్లించడం బల్దియాకు సవాల్‌గా మారింది.

**విడుదల కాని నిధులు** ఆస్తిపన్ను, ఇతర బకాయిలు విడుదల చేయకపోవడం, ఆస్తిపన్ను మాఫీతో జీహెచ్ఎంసీపై ఏటా పడుతున్న రూ. 600కోట్ల భారం భర్తీ చేయకపోవడం, వేర్వేరు సంస్థలకు చెల్లించిన నిధులు తిరిగి రాకపోవడమే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం.

# ఉల్లంఘనులు

ఆసిఫాబాద్: కంకర, క్రషర్, తెల్లసుద్ద క్వారీల్లో ప్రత్యేక బృందం ఆధ్వర్యంలో ఈటీఎస్(ఎలక్ట్రానిక్ టోటల్ సిస్టమ్) సర్వే కొనసాగుతోంది. లీజుకు తీసుకున్న భూమి కంటే అదనంగా ఆక్రమించి తవ్వడం, పర్మిట్లు తీసుకోకున్నా కంకరను తరలించడం, క్వారీలను తవ్వడంతో నిబంధనలు పాటించకపోవడం వంటి అంశాలు అధికారుల సర్వేల్లో వెలుగు చూస్తున్నాయి. నిర్ణీత భూమి కంటే అదనంగా తవ్వారనే కారణంతో జైనూర్ మండలం ఉషేగాం గ్రామ సమీపంలోని క్వారీ యజమాని డోక్రే సుభాష్‌కు అధికారులు రూ. 1.36 కోట్ల జరిమానా విధించారు. ఈ సొమ్ము చెల్లించడానికి మూడు నెలల గడువు ఇచ్చారు. జిల్లాలో తెల్లసుద్ద 7, కంకర క్వారీలు 8, క్రషర్‌లు 8 ఉన్నాయి. క్వారీలు నాలుగైదు హెక్టార్ల విస్తీర్ణంలో ఉండగా, తెల్లసుద్ద క్వారీలు 200 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. నిర్దేశిత భూమి పరిధిలోని క్వారీల్లో తవ్వకాలు చేపట్టాలి. అందుకు భిన్నంగా పక్కనున్న భూములను కలుపుకొని తవ్వేస్తున్నారు. జిల్లాలో నాలుగు వరుసల రహదారికి అవసరమయ్యే కంకరను కౌటాల మండలం ముత్యంపేట క్వారీల నుంచి తీసుకొచ్చారు. ఇక్కడ తనిఖీలు పూర్తయితే రూ.కోట్లలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశముంది.



ఒక్కరే సర్వేయర్..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు క్వారీలకు సంబంధించి ఒక్కరే సర్వేయర్ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఎంత మేరకు తవ్వుతున్నారో తెలియకుండా పోతుంది. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సర్వే చేస్తే క్వారీలు తవ్వకాలు సక్రమంగా ఉంటాయి. వర్షాలు వస్తున్నాయనే సమాచారంతో క్వారీల యజమానులు ముందస్తుగా అంటే ఒక నెల ముందుగా భారీగా తవ్వకాలు చేపట్టి, రాళ్లను వెలికితీసి కంకరగా మార్చుతున్నారు. ప్రస్తుతం అన్ని క్రషర్‌ల వద్ద గుట్టలుగా కంకర నిల్వ చేశారు. ఎంత తవ్వారు, ఎంత రాయల్టీ చెల్లించారో ఈ కంకరను చూసిన సులువుగా తెలుసుకోవచ్చనే గనులశాఖ అధికారులు చెబుతున్నారు.

త్వరలో నివేదికలు వస్తాయి – గంగాధర్, జిల్లా గనులశాఖ అధికారి

జైనూర్ మండలంలో ఏటీఎస్ సర్వే పూర్తయింది. మిగతా చోట్ల కొనసాగుతుంది. నాలుగైదు రోజుల్లో ఈ సర్వే సైతం పూర్తవుతుంది. అక్రమంగా తవ్వారని తేలితే తప్పకుండా జరిమానా విధించి వసూలు చేస్తాం.

అటవీ ప్రాంతాల్లో..వాంకిడి మండలం డోంగరగావ్ కొండపై క్వారీ ఏర్పాటు చేశారు. ఈ కంకరను సైతం నాలుగు వరుసల రహదారికే వినియోగించారు. పూర్తి అటవీ ప్రాంతంలో క్వారీకి ఎలా భూములు అప్పగించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. క్వారీ ఏర్పాటులో భూములు కోల్పోయిన రైతులకు కనీస పరిహారం సైతం ఇవ్వలేదు. ఈ క్వారీ ప్రస్తుతం మూతపడినా.. ఇక్కడ తనిఖీలు పూర్తయితే తరలించిన కంకరకు సంబంధించి భారీ స్థాయిలో గుత్తేదారుకు జరిమానా విధించనున్నారు.

రెబ్బెన మండలం రాళ్లపేట శివారు ప్రాంతం, కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్‌ను ఆనుకుని తెల్లసుద్ద క్వారీలు ఉన్నాయి. ఏ గుత్తేదారు ఎంత తవ్వుతున్నారో, ఎంత తరలిస్తున్నారో, రాయల్టీ ఎంత చెల్లిస్తున్నారో లెక్కలేకుండా పోయింది. వాంకిడి మండలం నవేగాం క్వారీ గడువు ముగిసినా రాత్రుల్లో రాళ్లను క్రషర్‌కు తరలిస్తున్నట్లు సమాచారం.

# మద్య నిషేధానికి శతాబ్ది

భైంసా : తానూరు మండలం ఝరి గ్రామంలో 2013లో మద్యనిషేధం అమలు చేశారు. కల్లు దుకాణాన్ని మూయించారు. మద్యం విక్రయాలను సైతం నిషేధించారు. ఆబ్కారీ అధికారులను వేడుకుని గ్రామంలో కల్లు గీత, విక్రయాలను నిలిపివేయించారు. దీంతో గ్రామంలో గొడవలు తగ్గాయని, చాలా మంది వ్యవసాయ కూలీలు రైతులుగా మారారని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఊరంతా ఐక్యంగా గ్రామంలో మొన్నటి కరోనా కాలం వరకు సామూహిక వివాహాలు జరిపించారు. పేద, మధ్యతరగతి తేడా లేకుండా కులాలకతీతంగా ఎవరి ఇంట పెళ్లి కుదిరినా, గ్రామస్థులంతా ఒక ముహూర్తం ఖరారు చేసే వరకు ఆగాల్సిందే. దీంతో పెళ్లి ఖర్చులు ఆదా అయ్యాయి. గ్రామంలో విద్యార్థులను ప్రోత్సహించేందుకు బహుమతులు అందిస్తున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఒకే విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఐక్యతను చాటుతున్నారు. ఊళ్లో ఆధ్యాత్మిక చింతన అలవడింది. అందరూ సన్మార్గాల్లో నడుచుకోవడంతో ఊరు ఆదర్శంగా నిలుస్తోంది. స్థానికులు జిల్లా అధికారుల ప్రశంసలు



అందుకుంటున్నారు. ఐక్యంగా అమలు చేశాం – తవ్వల్‌వాడ్ అవదూత్, ఝరి(బి)అంతా ఐక్యంగా ఉండి మద్యం నిషేధానికి కట్టుబడ్డాం. తొలుత ఇబ్బందులు పడ్డాం. కల్లు, మద్యం విక్రేతలు సమస్యలు సృష్టించారు. కానీ వాటిని సమష్టిగా ఎదుర్కొన్నాం. గ్రామస్థుల జీవితాలు మెరుగయ్యాయి. అభివృద్ధిలో అందరూ భాగస్వాములవుతున్నారు. మద్యం మానేయడంతో వ్యవసాయం చేస్తున్నా – దాసర్‌వాడ్ లక్ష్మణ్ తాగుడు అలవాటుతో పనులు చేయక కూలీగా మారాను. ఇక్కడ ఎవరూ పని ఇవ్వక పోవడంతో వలస వెళ్లి పాలేరుగా పని చేశాను. అక్కడ కూడా మానలేక పోయాను. కుటుంబ పోషణ భారమై మళ్లీ సొంతూరు వచ్చాను. ఇక్కడ కల్లు, మద్యం నిషేధించడంతో దొరకక మానేశాను. దీంతో కూలీపని మానేసి మళ్లీ సొంతంగా వ్యవసాయం చేస్తున్నాను. పిల్లల వివాహాలు చేశాం. నాలాంటి ఎన్నో కుటుంబాలు బాగుపడ్డాయి.

# అర్బన్ ఉద్యానానికి అడుగులు

పరిగి: చుట్టూరా గుట్టలు.. ఎటు చూసినా పచ్చని పైర్లు.. అనేక రకాల చెట్లు.. పక్షుల కిలకిలారావాలు.. మయూరాల విన్యాసాలు. .రయ్యిన వెళ్లే వాహనాలు ఇవన్నీ ఎక్కడ అనుకుంటున్నారా.. పరిగికి ఎనిమిది కి.మీ.దూరంలోని ప్రతిపాదిత అర్బన్ పార్కు ప్రదేశం. పార్కు ఏర్పాటుకు కసరత్తు జరగడం, కొత్త ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో స్థానికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

రెండున్నరేళ్ల కిందట: పరిగి మండలం జాఫర్‌పల్లి సమీపలో రెండున్నరేళ్ల కిందట అటవీశాఖ ఆధ్వర్యంలో అర్బన్ పార్కు ఏర్పాటు చేయాలని తలంచారు. ఇటీవల జిల్లా అటవీశాఖ అధికారులు సందర్శించి పరిస్థితులను పరిశీలించడం ప్రాధాన్యం సంతరించుకుంది. రిజర్వు ఫారెస్టు పరిధి మొత్తం 145 ఎకరాల విస్తీర్ణం. 50ఎకరాల్లో ఉద్యానం ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికను పంపారు. ఇందుకోసం రూ.2కోట్లు అవసరమవుతాయని అంచనా వేసింది.

సౌకర్యాలు ఇలా: ప్రతిపాదిత ప్రాంతంలో యోగా చేసేందుకు షెడ్డు, సెక్యూరిటీ గది, సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక బల్లలు, నడకదారి, అడవి అందాలను తిలకించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. నిధుల సమీకరణకు అన్వేషణ ప్రారంభమైంది. పార్క్ ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నామని జిల్లా అటవీ అధికారి



జ్ఞానేశ్వర్ తెలిపారు.

ఈ మార్గం ప్రధానం: పరిగి నుంచి షాద్‌నగర్, శంషాబాద్, రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లాలన్నా ఈ దారే ప్రధానం. కర్ణాటకకు చెందిన అనేక వాహనాలు నిత్యం వెళ్తుంటాయి. ప్రతిపాదిత ప్రాంతం నుంచి షాద్‌నగర్ పట్టణానికి 25కి.మీ. దూరం. పార్కు ఏర్పాటుతో పరిగి అభివృద్ధిలో ఇది మైలురాయిగా నిలుస్తుంది.

హొదా పెరిగినా..: పరిగి జనాభా 30వేలు. 6,349మంది వరకు ఉద్యోగులున్నారు. పార్కులు లేకపోవడంతో ఆహ్లాదంగా గడపలేకపోతున్నారు. ఐరన్ పరిశ్రమల ఏర్పాటుతో వాతావరణ కాలుష్యం కూడా పెరిగింది. ఇటువంటి పరిస్థితిలో పార్క్ ఏర్పాటు అత్యవసమని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

త్వరలో శంకుస్థాపన–రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అర్బన్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం పక్షం రోజుల్లోనే పనులకు శంకుస్థాపన చేస్తాం. అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. నిధుల సమీకరణకు ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటాం.

# అందని పరిహారం.. అన్నదాతల్లో ఆందోళన

జగిత్యాల : ప్రస్తుత భారీ వర్షాలతో జిల్లాలో వరి, పత్తి తదితర పంటలకు నష్టం వాటిల్లుతున్నా పరిహారం చెల్లింపుపై రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలబీమా అమలు చేయకపోగా రాష్ట్ర ప్రభుత్వం కూడా కొన్ని సీజన్లుగా తగిన పరిహారం ఇవ్వటం లేదు. 2020 వానాకాలంలో అధిక వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులకు 3 మాసాల్లోపు పెట్టుబడి రాయితీ (పంటనష్ట పరిహారం), 4 మాసాల్లోపు పంటలబీమా పరిహారాన్ని ఇవ్వాలని హైకోర్టు 2021 సెప్టెంబరు 28న రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది కానీ.. ఏ ఒక్క రైతుకు పరిహారాన్ని ఇవ్వలేదు. 2021 వానాకాలంలోనూ అధిక వర్షాలతో 30 వేల ఎకరాల్లో, 2021–22 యాసంగిలో రాళ్లవానలతో 12 వేల ఎకరాల్లో పంటలను రైతులు కోల్పోయినా రైతులకు పరిహారం అందలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత నష్టంతోపాటుగా గత సీజన్లలో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్ట పరిహారాన్ని చెల్లించాలని, ప్రస్తుత వానాకాలంలో పంటలబీమా అమలు అదను దాటిపోగా కనీసం వేసవి నుంచయినా పంటల బీమాను అమలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

**చేయూత ఏదీ?**

జిల్లాలో 2022 వానాకాలంలో 12,588 మంది రైతులకు చెందిన 22,993 ఎకరాల్లో ఆరుతడి పంటలు, 4,130 ఎకరాల్లో వరి దెబ్బతిన్నాయి. పొలాల్లోని మెత్తటి సారవంతమైన పైపొర (హ్యూమస్) మట్టి వరదకు కొట్టుకుపోయి కేవలం ఇసుక, రాళ్లు మిగలటంతో వేలాది ఎకరాల్లో భూములు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. సాగుచేసిన తోటలు, పొలాలకు గాను ఎకరాకు కనీసం రూ.15 వేల చొప్పున జిల్లా రైతులు రూ.40 కోట్లకుపైగా నష్టపోగా దెబ్బతిన్న పొలాలు, తోట భూములకు మరమ్మతులు చేసి మళ్లీ పంటలు సాగు చేసేందుకు రూ.60 కోట్లకుపైగా వెచ్చించినా పరిహారం చెల్లించలేదు. 2023 వానాకాలంలో భారీ వర్షానికి 180 గ్రామాలకు చెందిన 14,065 మంది రైతులకు చెందిన 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు.



భారీ వర్షంతో లోతట్టు, ఎగువ ప్రాంతం, పొలాలు, తోటలనే తేడాలేకుండా అంతటా వరదనీరు ముంచెత్తి పైర్లను తీవ్రంగా నష్టపరచింది. – పొలాల్లో గండ్లుపడి గట్లు కూడా నామరూపాల్లేకుండా కొట్టుకుపోగా మడుల్లో ఇసుకమేటలు, బండలు పేరుకు పోయాయి. రైతులు ఎకరాకు కనీసం రూ.17 వేల నుంచి రూ.36 వేల వరకు పెట్టుబడిని కోల్పోగా మరమ్మతులకు ఎకరాకు రూ.20 వేల చొప్పున వెచ్చించారు. 2024 వేసవిలోనూ 5,100 ఎకరాల్లో మామిడికి గాలివానలతో నష్టం వాటిల్లినా పరిహారం చెల్లించలేదు.

2023– మార్చి, ఏప్రిల్ మాసాల్లో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్చిలో జిల్లాలో 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా 532 ఎకరాలకు మాత్రమే పరిహారం చెల్లించారు.

ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో మామిడి, వరి, మక్క, నువ్వు, జొన్న, కూరగాయలు తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినా ఒక్క రైతుకు కూడా పరిహారం చెల్లించలేదు.

# భూగర్భ జలం.. సాగుకు బలం



ఎల్లారెడ్డిపేట : జిల్లాలో భూగర్భ జల మట్టాలు అటు ఇటుగా మారుతున్నాయి. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవగా నీటి వనరులు జలకళను సంతరించుకున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో భూగర్భజల మట్టాలు కొద్దిమేర వృద్ధి చెందినప్పటికీ గతేడాది సెప్టెంబరుతో పోల్చితే 1.90 మీటర్లు పడిపోయాయి. వానాకాలం సీజన్‌లో వ్యవసాయ పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడం, అందుకు అనుగుణంగా భూగర్భ జలాలను భారీగా వినియోగించడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. జిల్లాలో ఈ సంవత్సరం సెప్టెంబరు 6 వరకు 753 మిల్లీమీటర్ల సగటు వర్షపాతానికి గాను 915.7 మిల్లీమీటర్లు నమోదైంది. 22 శాతం ఎక్కువగా వానలు కురిశాయి.

చందుర్తి, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, కోనరావుపేట, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాల్లో అధిక వర్షపాతం నమోదవగా, రుద్రంగి, వేములవాడ గ్రామీణం, వేములవాడ, బోయినపల్లి, సిరిసిల్ల, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల్లో వర్షాలు సాధారణానికి పరిమితమయ్యాయి.

జిల్లాలో వంద ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన చెరువులు 94, వంద ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న చెరువులు 539 మొత్తం కలుపుకొని 633 చెరువులకు గాను 213 చెరువులు మత్తడి పారాయి. 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్న 39 చెరువులు, 100 ఎకరాలలోపు ఆయకట్టు ఉన్న 174 చెరువుల్లోని నీరు సైతం మత్తడి దూకి బయటకు వెళ్లిపోయింది.

ఎందుకీ వ్యత్యాసం

గతేడాది వానాకాలంలో అన్ని రకాల పంటలు కలుపుకొని 2,33,646 విస్తీర్ణంలో సాగవగా అందులో 1,81,507 ఎకరాల్లో వరి వేశారు. ఈ సంవత్సరం 2,32,046 ఎకరాల విస్తీర్ణంలో సాగైన వివిధ రకాల పంటల్లో 1,79,672 ఎకరాలతో వరి మొదటి స్థానాన్ని ఆక్రమించింది. గత సంవత్సరం వానాకాలం పూర్తయ్యే నాటికి జిల్లాలో 1,061.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అప్పటికే నీటి వనరుల్లో సమృద్ధిగా సాగునీరు ఉండటం వల్ల భారీ వర్షాలు తోడవడంతో చెరువులు, కుంటలన్నీ పూర్తిగా నిండిపోయాయి.

సాధారణంగా నీటి వనరుల నుంచి యాసంగి సీజన్‌లో ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేస్తుంటారు. గతేడాది వానాకాలం సీజన్‌లోనే పంటలకు సాగునీటిని వదిలారు.

ప్రధాన, పంట కాల్వల గుండా సమృద్ధిగా నీరు పారడంతో అన్నదాతలు వ్యవసాయ విద్యుత్తు మోటార్లు నడపడాన్ని నిలిపివేశారు. ఈ ఏడాది ఆయకట్టు భూములకు నీటిని విడుదల చేసే పరిస్థితి లేకపోవడంతో పంపుసెట్లను నిరంతరాయంగా నడిపించారు.

వర్షాలు కూడా రోజుల తరబడి విరామమిస్తుండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యవసాయ కరెంటు మోటార్లను నడపాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. దీంతో గతేడాది కంటే ఈ సారి వరిసాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ 2023 సెప్టెంబరు, 2024 సెప్టెంబరుతో పోల్చితే జిల్లా సగటు భూగర్భజల మట్టాల్లో 1.90 మీటర్ల తగ్గుదల స్పష్టంగా కనిపిస్తోంది.

ఎల్లారెడ్డిపేటలో అత్యధిక లోతున పాతాళగంగ

గత నెలలో జిల్లా సగటు భూగర్భజల మట్టాలు 5.76 మీటర్లలో ఉండగా ఎల్లారెడ్డిపేట మండలంలో 11.45 మీటర్ల లోతుకు వెళ్లాయి. రుద్రంగి మండలంలో 1.60 మీటర్ల అత్యల్ప లోతులో భూగర్భ జలాలు లభిస్తున్నాయి.

# కిడ్నీ బాధితులకు ఉపశమనం



పాల్వంచ : సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం కిడ్నీ బాధితులకు వరంగా మారనుంది. ఖరీదైన వైద్యం ఉచితంగా అందనుంది. ఇప్పటి వరకు డయాలసిస్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కిడ్నీ బాధితులు భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో పారిశ్రామిక ప్రాంతంలో డయాలసిస్ సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. సాధారణ రోజుల్లో 500కి పైగా, తరుణ వ్యాధుల సీజన్‌లో సీహెచ్‌సీలో ఓపీ 1,000 వరకు నమోదవుతోంది. మన్యం ప్రాంతం నుంచి వచ్చే వారిలో ఎక్కువగా కిడ్నీ సంబంధ వ్యాధులు బయటపడుతున్నాయి. రక్తశుద్ధి సేవలకు డిమాండ్ ఉంది. ఈక్రమంలో 50 పడకల సామర్థ్యంతో అయిదు యూనిట్లతో డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్‌ఎంఓ సోమరాజుదొర పర్యవేక్షిస్తున్నారు.

45 మంది వివరాలు నమోదు

ఇప్పటివరకు పాల్వంచ పరిసర ప్రాంతాల్లో డయాలసిస్ సేవలు లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికే పాల్వంచ సీహెచ్‌సీలో చికిత్స కోసం 45 మంది కిడ్నీ రోగులు తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఒక్కో బాధితుడికి వారంలో రెండు, మూడుసార్లు చికిత్స అందించాల్సి ఉంటుంది. కావాల్సిన వైద్యులను అందుబాటులో ఉంచారు. ఏడాదిగా డయాలసిస్ కేంద్రం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. ఇప్పటివరకు జిల్లాలో కొత్తగూడెం–5, ఇల్లెందు–5, మణుగూరు–5, అశ్వారావుపేట–5, భద్రాచలంలో పది యూనిట్లతో సేవలందిస్తున్నారు. పాల్వంచలో 5 యూనిట్లతో సేవలు అందుబాటులోకి రానున్నాయి. చర్లలో డయాలసిస్ కేంద్రాన్ని ఇంకా ప్రారంభించాల్సి ఉంది. పాల్వంచ సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎమ్మెల్యే కృషితో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కిడ్నీ బాధితుల సమస్యలు తీరనున్నాయి. రవిబాబు, డీసీహెచ్‌ఎస్

# గ్రామ పంచాయతీలకు ఊరట




సూర్యాపేట : జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పల్లెల్లో సర్పంచులు పదవీ కాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కొన్ని నెలలుగా నిధులు లేకపోవడం, అటు ప్రత్యేక పాలనలో అధికారులు అందుబాటులో ఉండక, సౌకర్యాలు సమకూరక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పారిశుద్ధ్యం, ఇతర అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోంది. సొంతంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందని, అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ పాలన కొనసాగిస్తున్నామని పంచాయతీ కార్యదర్శులు ఇప్పటికే ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నారు. పల్లెల పరిస్థితి దారుణంగా ఉండటంతో రాష్ట్రం ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. జిల్లాకు పాత రూ.కోటితో కలుపుకొని రూ.9.04 కోట్లను మంజూరు చేసింది.

కార్మికుల హర్షం జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా ఇటీవల 11 పంచాయతీలను అదనంగా ఏర్పాటు చేయడంతో వాటి సంఖ్య 486కు చేరింది. ఆయా పంచాయతీల జనాభా ఆధారంగా రాష్ట్ర ఆర్థిక సంఘ నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం పంచాయతీలకు మూడు రకాల నిధులు విడుదల చేయడంతో కొంత మేర ఊరట లభించింది. రెండు నెలల మల్టీపర్పస్, ట్రాక్టర్ ఈఎంఐలు, విద్యుత్తు బిల్లులకు డబ్బులు మంజూరయ్యాయి. విజయ దశమి నేపథ్యంలో నిధులు విడుదల కావడంతో 1862 మంది పంచాయతీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలలో ప్రత్యేక పాలన మొదలయ్యాక నిధులు విడుదల కావడం ఇదే ప్రథమం.

# వ్యక్తిగత రుణం ఇప్పించి.. రూ.20లక్షలు టోకరా

హైదరాబాద్ : పర్సనల్ లోన్ ఇప్పించి మరీ నగదు దోచేశారంటూ బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కాచిగూడ భద్రుకా కళాశాల వద్ద నివసించే ప్రైవేటు ఉద్యోగినికి ఫోన్ కాల్ వచ్చింది. ఆ తర్వాత స్కైప్ వీడియో కాల్ వచ్చింది. అందులో పోలీసు దుస్తుల్లో ప్రత్యక్షమైన వ్యక్తి తాను ముంబయి పోలీసులమని పరిచయం చేసుకున్నాడు. ఫెడెక్స్‌లో మీ ఆధార్ కార్డు ద్వారా ముంబయి నుంచి ఇరాన్‌కు రిజ్వాన్ అహ్మద్‌కు పార్సిల్ బుకింగ్ జరిగిందని, అందులో నిషేధిత వస్తువులున్నాయని ఆరోపించాడు. ఎన్‌సీఆర్‌బీ, ఆర్‌బీఐ, ముంబయి సైబర్ పోలీసులు కూడా కేసు దర్యాప్తు చేస్తున్నారని, నేరం రుజువైతే కనీసం 3 నుంచి 7 ఏళ్లు కఠిన కారాగార శిక్ష పడుతుందని బెదిరించాడు. మీ పేరిట దాదాపు 30 బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయని చెబుతూనే మరో వ్యక్తికి ఫోన్ ఫార్వర్డ్ అయింది. అవతలి వ్యక్తి ఆర్‌బీఐ అధికారినంటూ పరిచయం చేసుకొని, బాధితురాలి బ్యాంకు ఖాతా గురించి ఆరా తీశాడు. కేసు దర్యాప్తు పూర్తి అయ్యే వరకు ఆర్‌బీఐలో రూ.20 లక్షల వరకు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నాడు. డబ్బు లేదని బాధితురాలు చెప్పడంతో ప్రీ ఆప్రూవ్డ్ పర్సనల్ లోన్స్‌కు సంబంధించిన ఐసీఐసీఐ బ్యాంక్ లింక్ పంపించాడు. బాధితురాలికి రూ.20 లక్షల లోన్ ఇప్పించాడు. ఆ మొత్తం బాధితురాలు నేరస్థుడి ఖాతాకు బదిలీ చేసేశారు. ఆ తర్వాత మోసపోయినట్లు గ్రహించారు.

# ఉపాధి వేట ..ముళ్ల బాట

జగిత్యాల : జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వినోద్ ఉపాధి కోసం బెహరాన్ వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా కంపెనీ నుంచి బయటకు వచ్చాడు. అక్కడ ఎవరూ సహకరించకపోవడంతో పాటు గుర్తుతెలియని వారు దాడి చేయడంతో చేయి విరిగింది. అక్కడే అనారోగ్యం పాలై మానవతావాదుల సాయంతో ఇల్లు చేరాడు. రోజురోజుకూ ఆరోగ్యం మరింత క్షీణించి రెండ్రోజుల కిందట మృతిచెందాడు. వినోద్ లాగే చాలా మంది అభాగ్యులు కంపెనీ నిబంధనలు పాటించకుండా చిక్కుల్లో పడుతున్నారు. ఇబ్బందులు ఎదురయ్యాక తమకు సాయం చేసేవారు లేరంటూ ఆవేదన చెందుతున్నారు.

సాంకేతికంగా అభివృద్ధి పెరుగుతున్నా గల్ఫ్ దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. వీసాలు, వైద్య పరీక్షల పేరిట నకిలీ ఏజెంట్లు మోసం చేస్తూనే ఉన్నారు. ఇటీవల బాధితుల సంఖ్య పెరగడంతో జగిత్యాలలో పోలీసుశాఖ, వలసదారుల రక్షణ అధికారి(ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రెంట్స్), భారత విదేశాంగ శాఖ వారు అవగాహన, శిక్షణ ఏర్పాటు చేశారు. నకిలీల బారిన పడొద్దని, ఎలాంటి మోసం జరిగినా తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు చెబుతున్నారు. ఆర్మూరుకు చెందిన ఓ ఏజెంటు వైద్య పరీక్షలు చేయించి పలువురిని దుబాయి పంపగా అవి చెల్లవని చెప్పడంతో ఆర్మూరు, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన పలువురు తాము మోసపోయామని గుర్తించి లబోదిబోమన్నారు. గల్ఫ్ వెళ్లేవారికి అక్కడి కంపెనీల నిబంధనల మేరకు వైద్య పరీక్షలు చేయించాల్సి ఉండగా చాలా మంది ఏజెంట్లు తమకు అనుకూలమైన డయాగ్నోస్టిక్ కేంద్రాల్లో పరీక్షలు చేయించి పంపుతున్నారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకోకుండా అక్కడికి వెళ్లి తీరా కంపెనీలు పరీక్షలు చేయించడంతో అనారోగ్య సమస్యలు బయటపడి స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు.

ఫిర్యాదులకు అవకాశం

జగిత్యాలలో పోలీసులు నిర్వహించిన అవగాహన సమావేశంలో రాయబార కార్యాలయ అధికారులు కూడా ఉండటంతో పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్తే అక్కడి కంపెనీల్లో సదరు ఏజెంటు చెప్పిన జీతభత్యాలు, ఉపాధి లేకపోతే భారత రాయబార కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే ఏజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వం కూడా నకిలీలు, కంపెనీలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తోంది. జగిత్యాల జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దుబాయిలో రోడ్డు ప్రమాదంలో గాయపడగా కంపెనీ యాజమాన్యం పట్టించుకోక పోవడంతో గల్ఫ్ సంక్షేమ సంఘాల సహకారంతో కంపెనీపై ఫిర్యాదు చేశాడు. దీంతో కంపెనీ వారు నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది.

నకిలీలతో ఇబ్బందులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో లైసెన్స్ కలిగిన ఏజెంట్లు 33 మంది మాత్రమే ఉన్నారు. గల్ఫ్ ఏజెంట్లు ఇమ్మిగ్రేషన్ చట్టం 1983 నిబంధనలకు లోబడి పనిచేయాలని పోలీసులు పేర్కొంటున్నారు. అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించే కంపెనీల వివరాలు, జీతభత్యాలు ఏజెంట్లు తెలపాలని సూచిస్తున్నారు. గల్ఫ్ వెళ్లాలనుకుంటున్న వారు అత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్ 1800113090 74283 21144ను సంప్రదించాలని చెబుతున్నారు. సరైన ధ్రువపత్రాలు పరిశీలించి అభ్యర్థులను గల్ఫ్ దేశాలకు పంపాలని పోలీసులు వివరించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి లైసెన్స్ పొందాలని, ఏమైనా ఫిర్యాదులు వస్తే ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

బాధితులు సంప్రదిస్తే చర్యలు

గల్ఫ్ లాంటి దేశాలకు వెళ్లేవారు మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నకిలీ ఏజెంట్ల బారిన పడి మోసపోవద్దు. బాధితులు నేరుగా సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలువురు నకిలీ ఏజెంట్లపై కేసులు కూడా నమోదు చేశాం. అత్యవసర సమయాల్లో టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే సాయం అందుతుంది. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు కూడా నిర్వహిస్తున్నాం. ఆన్‌లైన్‌లోని సమగ్ర సమాచారాన్ని పరిశీలిస్తే మోసాల నుంచి తప్పించుకోవచ్చు.– అశోక్‌కుమార్, ఎస్పీ, జగిత్యాల

# ప్రాథమిక విద్య.. వారికి మిథ్య

ఆసిఫాబాద్ : మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా అసలే అంతంత మాత్రంగా నడిచే గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం, మరొకరు అక్కడికి రాకపోవడంతో బడులన్నీ మూతపడ్డాయి. ఈ ఏకోపాధ్యాయ పాఠశాలలకు చాలాచోట్ల ఉపాధ్యాయుల హాజరు అత్యంత తక్కువగా ఉంటుంది. వీరిని పర్యవేక్షించేందుకు అన్ని మండలాల పరిధిలో ఎస్ఆర్పీ (స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్)లను నియమించారు. కొందరు ఉపాధ్యాయులు ఏళ్ల తరబడి ఒకే చోట పనిచేస్తున్న ఎస్ఆర్పీలను కొన్ని చోట్ల మారుమూల ప్రాంతాల్లో తమకు అనుకూలంగా మలుచుకుని పాఠశాలలకు వెళ్లడం లేదు. ఈ నేపథ్యంలో పల్లెల్లో పాఠశాలలు రోజుల తరబడి మూతపడే ఉంటున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం బాబేఝరి పంచాయతీలోని చిత్తగూడ ప్రాథమిక పాఠశాల ఇది. ఇక్కడ 18 మంది విద్యార్థులు ఉన్నారు. పక్షం రోజుల నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారులు పాఠశాలకు వచ్చి వెళ్లిపోతున్నారు.

ఇంద్రవెల్లి మండలంలోని పొల్లుగూడ ప్రాథమిక పాఠశాలలో 12 మంది విద్యార్థులు ఉండగా.. ఇక్కడ ఉపాధ్యాయుడు లేరు. సిరికొండ మండలంలోని లక్ష్మీపూర్ పాఠశాలలో 40 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సైతం ఉపాధ్యాయుడు లేక మూతపడే ఉంటుంది.

గోవెన గొండుగూడ పాఠశాల

కుమురం భీం జిల్లా తిర్యాణి మండలంలో జెండగూడ, బొజ్జుగూడ, గోపెర, నాగగూడ గోపెర, గోవెన గోండుగూడ, కుర్సిగూడ, పాడిగూడ, కుంటగూడ, తాళ్లపేటగూడ, అర్జున్‌లొద్ది గ్రామాల్లో పాఠశాలలు ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుంచి తెరుచుకోవడం లేదు.

43 పాఠశాలల మూత' కథనం ప్రచురితం కాగా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా స్పందించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఐటీడీఏ అధికారులతో ఉట్నూర్‌లో సమావేశం నిర్వహించారు. బదిలీ అయిన చోట, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాంతాల్లోని పాఠశాలల వివరాలను సేకరించి, ఆయా ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే సీఆర్పీలను వెంటనే సర్దుబాటు చేయాలని ఆయా జిల్లాల గిరిజన సంక్షేమాధికారులను ఆదేశించారు. సర్దుబాటుతోపాటు విద్యను అందించాలి

మూతపడిన పాఠశాలలకు వారం అనంతరం ఉపాధ్యాయులు వెళతారని అధికారులు అంటున్నారు. సర్దుబాటు చేసిన వారితోపాటు, మిగతా ఏకోపాధ్యాయ పాఠశాలలు సక్రమంగా నిత్యం తెరుచుకునే విధంగా ఐటీడీఏ అధికారులు చూడాలని గిరిజనులు కోరుతున్నారు. వీటి పర్యవేక్షణ కోసం నియమించిన సీఆర్పీల ద్వారా పక్కాగా నివేదికలు అందేలా చూడాలి.

# చెత్త కష్టాలు తీరేదెన్నడో?

పెద్దపల్లి: పట్టణ పరిశుభ్రతలో ప్రధానమైన చెత్తసేకరణ, నిర్వహణ పురపాలికలకు సమస్యగా మారుతోంది. సేకరించిన చెత్తను నిల్వ చేసేందుకు సరైన స్థలాలు ఉండటం లేదు. పైగా చెత్త సేకరణలో జాప్యం ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. పారిశుద్ధ్య నిర్వహణలో పాలుపంచుకునే కార్మికులు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఉన్న నగరపాలిక, మూడు పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి.

ప్రతికూల ప్రభావం

డంపింగ్ యార్డుల కారణంగా దోమల ఉద్ధృతి పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. చెత్తను సెగ్రిగేషన్, బయోమైనింగ్ చేయకపోవడంతోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదే సమస్యపై గౌరెడ్డిపేట, సుల్తానాబాద్‌లోని మార్కండేయకాలనీ, యాదవనగర్ వాసులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ సిబ్బంది కూడా తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. పెద్దపల్లి పురపాలికలో గతనెలలో రెండుసార్లు కార్మికుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించడం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది.

ఇదీ పరిస్థితి జిల్లా వ్యాప్తంగా వివిధ పురపాలికల్లో నిత్యం 170 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుండగా.. అత్యధికంగా రామగుండం నగరపాలికలో 140 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది.

మంథనిలో 4 మెట్రిక్ టన్నులు, సుల్తానాబాద్‌లో టన్ను చొప్పున చెత్త ఉత్పత్తి అవుతోంది. రామగుండంలో నగరపాలికకు అధికారిక డంపింగ్‌యార్డు లేకపోవడంతో సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్‌లకు



చెందిన ఖాళీస్థలాల్లో చెత్తను వేస్తున్నారు.

మూతపడిన మేడిపల్లి ఓసీపీలో చెత్తను వెళ్లేందుకు ర్యాంప్ నిర్మించాలనే ప్రతిపాదన ఆచరణకు నోచుకోకపోవడంతో చెత్త తాత్కాలిక డంపింగ్ కేంద్రాలకే తరలుతోంది.

సుల్తానాబాద్ పురపాలికలో శాశ్వత డంపింగ్ యార్డు లేక స్థానిక మార్కండేయ కాలనీ శివారులోని ప్రభుత్వ భూమిలో చెత్త పడేస్తున్నారు. పెద్దపల్లిలోని గౌరెడ్డిపేట సమీపంలో ఉన్న డంపింగ్ యార్డుపై స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. – రామగుండంలోనూ గతంలో వ్యతిరేకత రావడంతో కేటాయించిన స్థలంలో చెత్తపారబోత నిలిచిపోయింది. మంథనిలో డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించినా.. గోదావరి తీర ప్రాంతంలోనూ చెత్త వేస్తున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యం

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించాం. రామగుండం నగరపాలికలో డంపింగ్‌యార్డు కోసం మూతపడిన సింగరేణి ఓసీపీ ప్రాజెక్టులో స్థలం కేటాయించాం. ఇక్కడ వాహనాలు వెళ్లేందుకు రహదారి నిర్మించాల్సి ఉంది. సుల్తానాబాద్‌లో రైల్వేస్టేషన్ సమీపంలో డంపింగ్‌యార్డు కోసం స్థలాన్వేషణ చేస్తున్నాం. మంథనిలో ఇప్పటికే స్థలం కేటాయించాం. ఇక్కడ త్వరలోనే బయోమైనింగ్ ప్రక్రియ చేపడుతాం. పెద్దపల్లి డంపింగ్‌యార్డులో ఇటీవల కురిసిన వర్షాల కాలంగా బయోమైనింగ్ నిలిచింది. జె.అరుణశ్రీ, అదనపు కలెక్టర్

# సర్దుబాటుకు కసరత్తు

భువనగిరి : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు విద్యాశాఖ గతంలో చేపట్టిన సర్దుబాటు ప్రక్రియ సత్ఫలితాలను ఇవ్వలేదు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, ఉపాధ్యాయుల అవసరాలను బట్టి మళ్లీ చేపట్టనున్న సర్దుబాటు ప్రక్రియ ఉపాధ్యాయ సంఘాలు ప్రస్తుతం వ్యతిరేకిస్తున్నాయి. తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియతో విద్యార్థులకు ప్రయోజనం చేకూరదని, నియామక ప్రక్రియ వేగవంతం చేసి విద్యాప్రమాణాలు పెంచాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మారుమూల ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా..

నాడు అవసరం ఉన్న పోస్టులను చూపించి, కొన్ని పోస్టులను బ్లాక్ చేసిన పక్షంలో మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలోని పోస్టులు భర్తీ అయ్యేవని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. దీంతో నేటికి జిల్లాలోని మారుమూల మండలాలు అయిన గుండాల, అడ్డగూడూరు, రాజపేట మండలాల్లోని పాఠశాలల్లో అత్యధిక పోస్టులు ఖాళీగా మిగిలాయి. దీనికి తోడు ప్రాథమిక పాఠశాలల్లోని అర్హులైన ఎస్జీటీలు పదోన్నతులు పొందారు, బదిలీ అయ్యారు. వీరి స్థానంలో డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయులను నియమించాల్సి ఉంది.

సర్దుబాటు ఇలా...జిల్లా వ్యాప్తంగా జులై నెలలో చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదు. 110 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా 70 మంది విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా 712 పాఠశాలలు పనిచేస్తున్నా యి. ఇందులో 38,277 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కలెక్టర్ అనుమతితో మళ్లీ సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసేందుకు విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. మండల విద్యాధికారులతో ఎక్కడ ఉపాధ్యాయులు అవసరం ఉన్నారో నివేదికలు తెప్పించుకుం టున్నారు.

పాఠశాలల్లో పరిస్థితులు...జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విభిన్న




పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, మరి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు అధికంగా ఉన్నారు. ఇటీవల చేపట్టిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా అర్హులైన ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న మండలాల్లోని పాఠశాలను ఎంపిక చేసుకుని ఉద్యోగాల్లో చేరారు. పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా ఖాళీగా ఉన్న పోస్టులు అన్ని చూపించడంతో కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయులు తమకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసుకున్నారు. వివరాలు సేకరిస్తున్నాం– కందుల సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నాం. సర్దుబాటు చేయాల్సిన ఉపాధ్యాయుల పోస్టుల వివరాలను మండల విద్యాధికారుల ద్వార నివేదిక తెప్పించుకుంటు న్నాం. వివరాల సేకరణ పూర్తయిన వెంటనే ఎక్కడ ఏ ఉపాధ్యాయుడు అవసరం అవుతారో వారిని అక్కడ సర్దుబాటు చేస్తాం.

# అందని సౌభాగ్యం




పరిగి : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. వ్యక్తిగత రుణాలతోపాటు సమష్టిగా అందిస్తూ సంఘాల బలోపేతానికి తోడ్పడుతోంది. మరోవైపు గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలోనే చౌక ధరలకు మందులు అందించే దుకాణాలు ఏర్పాటు చేయించేందుకు సంకల్పించింది. ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు కనీసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభిస్తామని అధికారులు రెండేళ్లుగా చెబుతున్నా ప్రతిపాదనలతోనే సరిపోయింది. ఇప్పటి వరకు ఒక్కటీ ప్రారంభించకపోవడంతో పేదల ఆశలు ఆవిరవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఎంతో మేలు..: సౌభాగ్య పథకం కింద జన్ ఔషధి స్టోర్ పేరిట రూ.3 లక్షల వరకు రుణ సదుపాయం కల్పించి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఔషధ దుకాణాలు నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయాధారిత జిల్లా కావడంతోపాటు నిరక్షరాస్యత అధికంగా ఉండటంతో మహిళల్లో ఆరోగ్యంపై అవగాహన కొరవడి తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. మందుల కొనుగోళ్లు వారికి ఆర్థిక భారంగా మారాయి. చౌక ధరలకు ఔషధాలు దొరికితే ఎంతో ప్రయోజనం కలగనుంది. పల్లెల్లో కొనసాగుతున్న ఆర్ఎంపీ, పీఎంపీలు సైతం నాడి పడితే రూ.వందల్లో గుంజుతున్నారు. సెలైన్ పెడితే రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కసారి అనారోగ్యం పాలైతే వారం, పది రోజులు చేసిన కూలీ డబ్బులు ఆవిరయిపోతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

నిబంధనల సడలింపు..

జనరిక్ ఔషధ స్టోర్‌లను ప్రారంభించేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. గతంలో బీ ఫార్మసీ, ఎంఫార్మసీ చదువుకున్న వారికే అవకాశముండేది. ప్రస్తుతం ఆ నిబంధనను సవరించారు. సంఘం సభ్యురాలి కుటుంబీకులు, స్నేహితులు, బంధువులు దరఖాస్తు చేసుకోవచ్చు. ధ్రువపత్రాన్ని అయిదేళ్లపాటు లీజుకు తీసుకొని నడిపించేందుకు అవకాశం కల్పించారు. గతేడాది తాండూరు, కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్, దోమ నుంచి ప్రతిపాదనలు వెళ్లినా వివిధ కారణాలతో అవి తిరస్కరణకు గురయ్యాయి.

మండలాలు: 20

పొదుపు సంఘాలు: 15,966

గ్రామ సమాఖ్యలు: 655

సంఘాల సభ్యులు: 1,69,250

వచ్చే నెలాఖరులోపు ప్రారంభిస్తాం..

జిల్లాలోని అన్ని మండలాల్లో జనరిక్ ఔషధ దుకాణాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. తొలి దశలో జిల్లాలో కనీసం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ విషయంలో సంఘాల్లోని సభ్యులకు ప్రత్యేకించి అవగాహన కల్పిస్తున్నాం. సభ్యుల పిల్లలు అర్హులైతే ప్రతి మండల కేంద్రంలోనూ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అందుబాటు ధరల్లో పేదలకు మందులు అందించడం జనరిక్‌తోనే సాధ్యం. ఉదయకుమారి, స్త్రీనిధి జిల్లా మేనేజర్.

# ఆర్థరైటిస్ పంజా



హైదరాబాద్ : క్లిష్టమైన ఆర్థరైటిస్ వ్యాధి పంజా విసురుతోంది. వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దల్లో ఈ సమస్య కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ముందే గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా ఉపశమనం పొందవచ్చనని సూచిస్తున్నారు. నగరంలో ఆర్థరైటిస్ బాధితుల సంఖ్య పెరుగుతోందని వైద్యులు పేర్కొంటున్నారు. ఈ నెల 12న ప్రపంచ అర్థరైటీస్ నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనం.. ఆర్థరైటిస్‌ను పలు రకాలుగా విభజించారు. వృద్ధుల్లో ఎక్కువగా ఆస్టియో ఆర్థరైటిస్ సమస్య కనిపిస్తే.. మహిళలు, యువతుల్లో లూపస్‌గా ఆర్థరైటిస్ వేధిస్తుంది. దీనివల్ల ముఖంపై సీతాకోక చిలుక ఆకారంలో ఎర్రటి మచ్చలు ఏర్పడతాయి. ఇంకొందరు గౌట్‌తో బాధపడుతున్నారు. దీనివల్ల చేతులు, కాళ్ల వేళ్లు బాగాల్లో వాపు, నొప్పితో తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఆస్టియో ఆర్థరైటిస్ కారణంగా ఎముకలు పెలుసుబారి తీవ్రమైన కీళ్ల నొప్పులు వేధిస్తాయి. ఇదో ఆటో ఇమ్యూన్ సమస్య. మనలోని వ్యాధి నిరోధక శక్తి తిరిగి శరీరంపై దాడి చేసినప్పుడు ఈ సమస్యకు కారణమవుతుంది. పిల్లల్లో సైతం జువైనల్ ఆర్థరైటిస్‌కు దారి తీస్తుంది. వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక ఇబ్బందులు లేకుండా బయట పడవచ్చు. ఆర్థరైటిస్ నుంచి బయట పడాలంటే వీలైనంత త్వరగా వ్యాధిని నిర్ధారించాలి.

ఈ లక్షణాలు ఉంటే..

ఆరు వారాల కంటే ఎక్కువ కాలం పాటు నిరంతర కీళ్ల నొప్పులు, వాపు.

దీర్ఘకాలిక జ్వరం.

ఎండ తగిలితే చర్మం మీద దద్దుర్లు రావడం.

కీళ్ల నొప్పులు, నోటి పూత పదేపదే వేధించడం.

బాగా బరువు తగ్గిపోవడం, ఆకలి లేకపోవడం.

కళ్లు పొడిబారిపోవడం, నోరు, చర్మం పొడిగా మారడం.

ఉదయం పూట 45 నిమిషాలు కంటే ఎక్కువ సేపు తీవ్రమైన వెన్ను లేదా మెడనొప్పి.

కీళ్ల నొప్పులతో పాటు రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరగడం.

తీవ్రమైన కండరాల బలహీనత, నొప్పులు.

చిన్న పిల్లల్లో కీళ్ల నొప్పులు వేధించడం.

అందుబాటులోకి ఆధునిక చికిత్సా విధానాలు.. అర్థరైటీస్‌కు ప్రస్తుతం ఆధునిక చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. సంప్రదాయ గోలీలు నుంచి అధునాతన బయోలాజికల్ ఇంజక్షన్లు, కార్టిసెల్ థెరపీ కూడా ఉంది. అర్థరైటీస్ చికిత్సల్లో స్టెరాయిడ్ల వాడకంపై ఆందోళనలు అవసరం లేదు. వైద్యుల పర్యవేక్షణలో కొద్ది మోతాదులో స్వల్ప కాలానికి స్టెరాయిడ్లు ఉపయోగించవచ్చు. లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా రుమటాలజిస్టులను సంప్రదించాలి. పరీక్షల ద్వారా ఏ రకమైన అర్థరైటీస్ ఉందో నిర్ధారణ అవుతుంది. డాక్టర్ వి.శరత్‌చంద్రమౌళి, రుమటాలజీ, క్లినికల్ ఇమ్యునాలజీ విభాగాధిపతి, కిమ్స్

# ఆన్‌లైన్ ఆట.. నేరాల బాట

హైదరాబాద్ : ఆన్‌లైన్ గేమింగ్ సరదాగా మొదలై.. వ్యసనంగా మారుతోంది. గెలుపోటముల మధ్య ఇరికించి అప్పులపాలు చేస్తోంది. వీటిని తీర్చేందుకు నేరాలబాట పట్టిస్తోంది. విద్యార్థుల నుంచి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న వారూ బాధితుల జాబితాలో చేరుతున్నారు. ఎన్నో ఉదంతాలు..అంబర్‌పేట్‌కు చెందిన 11 ఏళ్ల బాలుడు తల్లి ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అక్కడ టాస్క్‌లు పూర్తి చేసేందుకు.. కొత్త ఆయుధాలు కొనేందుకు తల్లి బ్యాంకు ఖాతాలో డబ్బు ఖర్చు చేశాడు. నగదు విత్‌డ్రా చేసేందుకు బ్యాంకుకెళ్లిన తల్లికి ఖాతాలో రూ.27 లక్షలు మాయమైనట్లు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది.

గుడిమల్కాపూర్‌లో ఉంటున్న ఇంజినీరింగ్ విద్యార్థి రూ.60 వేలు రుణం తీసుకొని వాటిని తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

2022లో నగరంలో ఆన్‌లైన్ గేమింగ్‌లో రూ.60 వేలు పోగొట్టుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి.

2023 నాటికి అది రూ.1.60 కోట్లకు చేరింది.

ఈ ఏడాది 9 నెలల్లో రూ.2.5 కోట్ల మేర ఆన్‌లైన్ గేమింగ్‌తో నష్టపోయినట్లు ఫిర్యాదులు అందాయి. ఊహల్లో చేరి.. పాత్రలతో విహరించి

అధిక శాతం మంది విద్యార్థులు, యువత రోల్ ప్లేయింగ్ గేమ్స్(ఆర్‌పీజీ)కు ఆకర్షితులవుతున్నారు. ఇక్కడ కనిపించే కొత్త ప్రపంచం..వినూత్న పాత్రలు ఊహ ప్రపంచంలోకి తీసుకెళతాయి. మొదట్లో ఆటవిడుపుగా ప్రారంభమై.. క్రమంగా ఆ పాత్రలన్నింటిలోకి చేరి తామే అక్కడ యుద్ధం చేయాలి. కొత్త దుస్తులు ధరించాలి. ఆధునిక ఆయుధాలతో శత్రువులపై పైచేయి సాధించాలనేంతగా అలవాటుపడతారు. ఆటకు బానిసలైన వారు తల్లిదండ్రులకు తెలియకుండా వారి బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, యూపీఐ మార్గాల నుంచి డబ్బు చెల్లిస్తున్నారు.



ఒక్కసారి దిగాక అంతే ఇక..

నాంపల్లిలోని ప్రముఖ బ్యాంకు ఉద్యోగి. వ్యక్తిగత, విద్యా రుణాలు ఇచ్చే పోస్టులో ఉన్నారు. ఖాతాదారులు జమచేసిన రూ.1.50 కోట్లను తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లించుకున్నారు. దర్యాప్తులో ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిసైన ఆ ఉద్యోగి అప్పులు తీర్చేందుకు మోసానికి పాల్పడినట్లు వెల్లడైంది.

బెంగళూరుకు చెందిన యువకుడు ఆటకు బానిసయ్యాడు. అవసరమైన డబ్బు కోసం సామాజిక మాధ్యమాల నుంచి మహిళల ఫొటోలు సేకరించి వాటితో డేటింగ్ యాప్‌లో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి విదేశాల్లోని యువతను ఆకట్టుకునేవాడు. వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి వాటిని బయటపెడతానంటూ బెదిరించి డబ్బు వసూలు చేసేవాడు.

సికింద్రాబాద్‌లో ఓ వ్యాపారి ఇంట్లో వజ్రాలహారం మాయమవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదో తరగతి చదువుతున్న వ్యాపారి కుమారుడే ఆ నగను కాజేసి మరొకరి ద్వారా విక్రయించినట్లు బయటపడింది.

ఈనాడు, హైదరాబాద్

# పోస్టుల భర్తీ.. పెరిగిన ఆదరణ

వికారాబాద్ : గురువుల పోస్టుల భర్తీ కొనసాగుతుండడంతో ఉపాధ్యాయ శిక్షణపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. గతేడాది వికారాబాద్ ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో సుమారు 40 సీట్ల వరకు భర్తీ కాలేదు. ఈసారి మాత్రం అన్నీ నిండాయి. శిక్షణ సంస్థలో 150 సీట్లున్నాయి. సమస్యలతో కొట్టుమిట్టాడిన సంస్థను గాడిన పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

29 మంది ఉపన్యాసకులు..జిల్లా విద్యాశిక్షణ సంస్థలో 29 మంది ఉపన్యాసకులు ఉండాలి. ఒక్కొక్కరు పదవీ విరమణ చేయడంతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయి. ఇటీవల 13 మంది అతిథి అధ్యాపకులను నియమించి కొరత తీర్చారు. కొత్త వారికి ఈనెల 17– 20 వరకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నారు. దీంతో సమస్య పరిష్కారం కానుందని చెబుతున్నారు.



37 ఏళ్ల కిందట ప్రారంభం..

వికారాబాద్‌లో జిల్లా విద్యాశిక్షణ సంస్థ 37 ఏళ్ల కిందట ప్రారంభించారు. ఏటా 150 మంది విద్యార్థులను కొత్తగా చేర్చుకొని శిక్షణ ఇస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి 300 మంది ఉంటారు. తెలుగు, ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాల్లో 50 చొప్పున సీట్లు ఉన్నాయి. అధ్యాపకుల కొరత తీరనుంది..

జిల్లా విద్యాశిక్షణ సంస్థలో ఖాళీలను అతిథి అధ్యాపకులతో భర్తీ చేశాం. దీంతో అధ్యాపకుల కొరత తీరనుంది. కొత్తగా ఎంపికైన వారికి రెండ్రోజులపాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ఈనెల చివరి వారం నుంచి వారు బోధన ప్రారంభిస్తారు. ఉపాధ్యాయ శిక్షణకు అభ్యర్థుల్లో ఆసక్తి పెరిగింది. ఈసారి ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఎంపిక, ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. త్వరలో తరగతులు ప్రారంభం కానున్నాయి. రామాచారి, ప్రిన్సిపల్, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, వికారాబాద్.

# దసరా వేళ బందీ అవుతున్న రాష్ట్రపక్షి

హైదరాబాద్ : స్వేచ్ఛగా తిరగాల్సిన రాష్ట్రపక్షి పాలపిట్ట పంజరాల్లో బందీ అవుతోంది. విజయదశమి రోజున దీనిని చూస్తే మంచి జరుగుతుందని, విజయాలు వరిస్తాయన్న నమ్మకాన్ని కొందరు సొమ్ము చేసుకుంటుండడంతో వాటి సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. రాజధాని పరిధిలోని మూడు జిల్లాల్లో సంచరిస్తున్న అతి ప్రాధాన్యమున్న 104 పక్షి జాతుల్లో పాలపిట్ట ఒకటి. ఈ జిల్లాల పరిధిలో గత ఏడాది 400 పాలపిట్టలు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య 300లకు పడిపోయినట్లు బర్డింగ్‌పల్స్ సంస్థ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలపిట్ట పక్షుల సంఖ్య తగ్గుతుండడం ఆందోళన



కలిగిస్తోందని స్టేట్ ఆఫ్ ఇండియా బర్డ్స్ నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఐయూసీఎన్ రెడ్ లిస్టులో ఉందని, ఈ పక్షి జాతిని కాపాడుకోకపోతే ఈ సంఖ్య మరింతగా తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. విజయదశమి రోజున రావణదహనం, జమ్మి బంగారం ఇచ్చిపుచ్చుకునే ప్రదేశాలు, 'అలయ్ బలయ్' ఇచ్చుకునే చోట పంజరాల్లో ప్రదర్శిస్తూ కొందరు జేబులు నింపుకొంటున్నారు. స్వేచ్ఛగా తిరగాల్సిన వీటిని పంజరాల్లో బంధించడంతో సరిగా ఆహారం, నీరు తీసుకోక డీహైడ్రేషన్‌తో చనిపోతున్నాయి.

బంధిస్తే జరిమానా, జైలుశిక్ష..పాలపిట్టలు వన్యప్రాణుల విభాగంలోని అటవీ చట్టం పరిధిలోకి వస్తాయి. వీటిని బంధించడం శిక్షార్హమైన నేరం. పాలపిట్టను బంధించినా, హింసించినా నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేస్తారు. మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించే అవకాశం ఉంది.

# అత్యవసరమా.. అంతరాయమా

హైదరాబాద్: నగరంలో విద్యుత్తు అంతరాయాల సమయ ంలో మరింత వేగంగా సేవలు అందించేందుకు సెంట్రల్ బ్రేక్‌డౌన్ గ్యాంగ్ (సీబీడీ)లకు కొత్త వాహనాలను సమకూర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ నిర్ణయించింది. వాహనాలు ఎలా ఉండాలనే దానిపై ఆగస్టు 31న సీఎండీ ఒక కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సూచనల మేరకు సిద్ధమైన యుటిలిటీ వాహనాలు మింట్ కంపౌండ్‌లోని కార్పొరేట్



కార్యాలయానికి చేరాయి. విద్యుత్తు శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా వీటిని ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం కార్పొరేట్ కార్యాలయంలో 8 వాహనాలున్నాయి. మరిన్ని వస్తాయని చెబుతున్నారు. ప్రత్యేకంగా కన్పించేలా... విద్యుత్తు సిబ్బంది అవసరాలు తీరుస్తూ.. చూడగానే విద్యుత్తు పంపిణీ సంస్థకు చెందిన వాహనంగా ప్రత్యేకతను చాటేలా కొత్త వాహనాలకు డిజైనింగ్ చేయించారు. విద్యుత్తు అంతరాలు, అత్యవసరాల్లో ఫిర్యాదు చేసే డయల్ 1912 పెద్దగా కన్పించేలా వాహనంపై రాయించారు.




అమరావతి: జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రులను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కొందరు మంత్రులకు రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. ఆ వివరాలివీ.. శ్రీకాకుళం- కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం- వంగలపూడి అనిత, పార్వతీపురం మన్యం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ- అచ్చెన్నాయుడు, విశాఖపట్నం- డోలా బాలవీరాంజనేయస్వామి, అల్లూరి సీతారామరాజు- గుమ్మిడి సంధ్యారాణి, అనకాపల్లి- కొల్లు రవీంద్ర, కాకినాడ- పొంగూరు నారాయణ, తూర్పుగోదావరి- నిమ్మల రామానాయుడు, ఏలూరు- నాదెండ్ల మనోహర్, పశ్చిమగోదావరి, పల్నాడు- గొట్టిపాటి రవికుమార్, ఎన్టీఆర్- సత్యకుమార్ యాదవ్, కృష్ణా- వాసంశెట్టి సుభాష్, గుంటూరు- కందుల దుర్గేష్, బాపట్ల- కొలుసు పార్థసారథి, ప్రకాశం- ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు- ఎన్ఎండీ ఫరూక్, నంద్యాల- పయ్యావుల కేశవ్, అనంతపురం- టీజీ భరత్, శ్రీసత్యసాయి, తిరుపతి- అనగాని సత్యప్రసాద్, వైఎస్ఆర్- ఎస్.సవిత, అన్నమయ్య- బీసీ జనార్దన్‌రెడ్డి, చిత్తూరు- మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి




## దిగుమతుల నుంచి.. ఎగుమతులు చేసే స్థాయికి

ఢిల్లీలోని భారత్ మండపంలో వరల్డ్ టెలీకమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ-2024 కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ ఫోన్ల తయారీ గురించి ప్రస్తావించారు.

సెమీకండక్టర్ విభాగంలో పెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పిన ఆయన త్వరలోనే పూర్తిగా మేడిన్ ఇండియా మొబైల్స్ తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో మొబైల్ తయారీ యూనిట్లు వేగంగా విస్తరిస్తున్నాయన్నారు. " 2014లో కేవలం రెండు మొబైల్ తయారీ యూనిట్లు ఉంటే ఇప్పుడు ఆ సంఖ్య 200కి చేరిందన్నారు. ఇంతకుముందు ఫోన్లను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం. ఇప్పుడు ఏకంగా ఆరు రెట్లు మొబైల్స్‌ను ఇక్కడే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచ దేశాలకు మేడిన్ ఇండియా మొబైల్స్ అందించాలని చూస్తున్నాం. సెమీ కండక్టర్స్ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాం" అని మోదీ వెల్లడించారు. ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయన్నారు. సాంకేతికత వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని ఆయన అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మంచి కోసమే వినియోగించాలని హితవు పలికారు.

## వైభవంగా పైడితల్లి సిరిమానోత్సవం.. భారీగా తరలివచ్చిన భక్తజనం

విజయనగరం: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్తరాంధ్రలోని పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో విజయనగరం జనసంద్రంగా మారింది. అమ్మవారి ప్రతిరూపంగా పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమాను అధిరోహించారు. అంజలి రథం, తెల్లటి ఏనుగు రథం, పాలధార, జాలరివల ముందు నడవగా ప్రధాన ఆలయం నుంచి విజయనగరం గజపతుల కోట వరకు సిరిమాను ఊరేగింపు కన్నుల పండువగా సాగుతోంది. జై పైడిమాంబ.. జైజై పైడిమాంబ అంటూ.. సిరిమానుపై అరటిపండ్లు విసురుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తమ ఆడుపడుచు ఉత్సవాన్ని గజపతుల కుటుంబీకులు విజయనగరం కోట నుంచి వీక్షించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ అప్పలనాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, జిల్లా కలెక్టర్ అంబేద్కర్ తదితరులు కోటపై ఆశీనులై అమ్మవారి సిరిమనోత్సవాన్ని తిలకించారు. ఉత్సవాలకు దాదాపు అయిదు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చినట్టు అంచనా. ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించిన నేపథ్యంలో రూ. 1.30 కోట్లతో ఏర్పాట్లు చేశారు. 2000 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.



**పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న తెదేపా నాయకులు :** జిల్లాలో పైడితల్లి అమ్మవారిని మాజీ ఎంపీ పూసపాటి అశోక్ గజపతి రాజు, ఎమ్మెల్యే అదితి గజపతి దర్శించుకుని పూజలు చేశారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎంపీ కలిశెట్టీ అప్పలనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. . శ్రీపైడితల్లి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్. పూర్ణకుంభం, ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికిన దేవాదాయశాఖ అధికారులు, ఆలయ అర్చకులు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి శ్రీపైడితల్లి కి పట్టువస్త్రాలు సమర్పించారు.

శ్రీపైడితల్లి అమ్మవారికి పట్టువస్త్రాలు అందచేయడం ఆనందంగా ఉందని మంత్రి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఈ మహాభాగ్యము కలిగిందన్నారు.

## పోలీసు అధికారుల ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా




అమరావతి, అక్టోబర్ 15: ముంబై నటి జెత్వానీ కేసులో పోలీసు అధికారుల ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఈరోజు (మంగళవారం) హైకోర్టులో విచారణ జరిగింది. కేసును తాజాగా సీఐడీకి అప్పగించారని , కౌంటర్లు వేసేందుకు సమయం ఇవ్వాలని కోర్టును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభ్యర్థించారు. కేసు డిస్పోజ్ అయ్యే వరకు పోలీస్ అధికారులకు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు అమలయ్యే విధంగా చూడాలని పిటిషనర్‌ల తరపున న్యాయవాదులు అభ్యర్థించారు. ఈ అంశాలను నోట్ చేసుకున్న న్యాయస్థానం.. కేసు తదుపరి విచారణను ఈనెల 23కు వాయిదా వేసింది. కాగా.. నటి జెత్వానీ కేసు విచారణను సీఐడీకి అప్పగిస్తూ ఇటీవల డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును విజయవాడ పోలీసులు దర్యాప్తు చేయగా... సీనియర్ పోలీసు అధికారులు నిందితులుగా ఉండటం, ముంబై లింక్‌ల నేపథ్యంలో సీఐడీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ప్రథమ నిందితుడు కుక్కల విద్యాసాగర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో నిందితులుగా ఉన్న అప్పటి విజయవాడ సీపీ క్రాంతి రాణా, డీసీపీ విశాల్ గున్ని, దర్యాప్తు అధికారి సత్యనారాయణ ముందస్తు బెయిల్ కోసం హైకోర్ట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు.

## కల్తీ నెయ్యి వ్యవహారం.. స్వతంత్ర విచారణలో రాష్ట్ర పోలీసుల జోక్యం ఉండదు: ఏపీ డీజీపీ

అమరావతి: తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో కేంద్రం చేపట్టే స్వతంత్ర విచారణలో రాష్ట్ర పోలీసుల జోక్యం ఉండదని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. కల్తీ నెయ్యి కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌ను సుప్రీంకోర్టు అనుమానించలేదని చెప్పారు.

ఈ వ్యవహారంలో స్వతంత్ర దర్యాప్తు జరగాలన్న ఉద్దేశంతోనే ప్రత్యేక బృందం ఏర్పాటు చేసిందని వెల్లడించారు. సిట్ సభ్యులుగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి, డీఐపీ గోపీనాథ్ జెట్టి పేర్లను పంపామని తెలిపారు. తెదేపా కేంద్ర కార్యాలయం, గన్నవరం పార్టీ ఆఫీస్‌పై దాడి కేసులతో పాటు మరో రెండు కేసులను సీఐడీకి బదిలీ చేసినట్లు డీజీపీ తెలిపారు. వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై లుకౌట్ నోటీసు ఉందన్నారు. ఓ కేసులో గుంటూరు జిల్లా ఎస్పీ దీన్ని జారీ చేశారని చెప్పారు.






## భారీ నుంచి అతిభారీ వర్షాలు.. ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్.. ఈ జిల్లాల్లో సెలవు

అమరావతి : తెలుగు రాష్ట్రాలకు మరో తుపాను గండం పొంచివుంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం.. నేడు మరింత బలపడి, తీవ్ర అల్పపీడనంగా మారనుంది. ఇది తుఫాన్‌గా మారి.. ఎల్లుండి తీరం దాటుతుందని వాతావరణశాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర జిల్లాలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తీరం వెంబడి గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, బాపట్ల, ప్రకాశం, కడప, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో తుఫాన్ ప్రభావం ఉంటుందని సమాచారం. ఇప్పటికే అల్పపీడనం ప్రభావంతో ఏపీలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం తుపానుగా మారనుందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. నెల్లూరు జిల్లాలో స్కూల్స్‌కు సెలవు ప్రకటించారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టారు. వేటకు వెళ్లొద్దంటూ మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఏపీలో తుఫాన్ పరిస్థితులపై సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆదేశించారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిపై ఆరా తీశారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం.. వాయుగుండంగా మారి పుదుచ్చేరి - చెన్నై మధ్య తీరం దాటుతుందని IMD అంచనా వేస్తోంది.. ఈ నేపథ్యంలో దక్షిణ కోస్తా, రాయల సీమ జిల్లాలకు రేపు రెడ్ అలర్ట్ జారీ చేసింది.. ఇవాళ, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.. ఒకటి రెండు చోట్ల అత్యంత భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉండగా.. మరో నాలుగు రోజుల పాటు వీటి ప్రభావం కొనసాగుతోందని పేర్కొంది.. భారీ వర్షాల నేపథ్యంలో.. నేడు, రేపు పాఠశాలలకు, అంగన్వాడి కేంద్రాలకు సెలవు ప్రకటించారు తిరుపతి, చిత్తూరు జిల్లా కలెక్టర్లు.. మరోవైపు ప్రకాశం జిల్లాలోనూ సెలవుగా ప్రకటించింది ప్రభుత్వం.. నెల్లూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు ఈ రోజు సెలవుగా ప్రకటించారు.. ఇక వర్షాల నేపథ్యంలో.. శ్రీ సత్యసాయి జిల్లాలో అక్టోబర్ 15, 16, 17 తేదీలలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు కలెక్టర్ టీఎస్ చేతన్.. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం .. బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని.. తదుపరి 2 రోజులలో పశ్చిమ-వాయువ్య దిశగా ఉత్తర తమిళనాడు,దక్షిణకోస్తా తీరాల వైపు కదులుతుంది.. దీని ప్రభావంతో ఇవాళ, రేపు దక్షిణకోస్తా,రాయలసీమలో విస్తృతంగా వర్షాలు.. కొన్నిచోట్ల భారీ నుండి అతిభారీ వర్షాలు.. పలుచోట్ల అతితీవ్రభారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.. ఇవాళ పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీవర్షాలు కురిసే అవకాశం ఉంది.. నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీవర్షాలు నమోదయ్యే అవకాశం ఉండగా.. మిగత జిల్లాల్లో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.




## సుప్రీంకోర్టు సంచలనం- నోటీసులు జారీ

అమరావతి : దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో దాదాపుగా అన్ని రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత హామీలను లంచాలుగా పరిగణించాలంటూ దాఖలైన పిటీషన్‌ను దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులను జారీ చేసింది. ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి, వైఎస్ఆర్సీపీ సహా దేశవ్యాప్తంగా దాదాపు అన్ని పార్టీలు ఎన్నికల ప్రచార సమయంలో అంచనాలకు మించిన హామీలు ఇచ్చాయి. ఓటర్లను తమ వైపు తిప్పుకోవడానికి టీడీపీ కూటమి సూపర్ 6ను ప్రకటించింది. నవరత్నాల పేరుతో వైఎస్ఆర్సీపీ తన ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసింది. మొన్నటి హర్యానా ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఏడు గ్యారంటీలను ఇచ్చిన విషయం తెలిసిందే.

దాదాపుగా అన్ని పార్టీలు కూడా అనేక హామీల సునామీని జనంపై కురిపించాయి. వాటన్నింటినీ కూడా లంచాలుగా పరిగణించాలంటూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. లంచం ఇచ్చి ఓటును కొనుగోలు చేస్తోన్నట్లుగా ఎందుకు భావించకూడదంటూ పిటీషన్‌దారులు సుప్రీంకోర్టును ప్రశ్నించారు. లంచం ఇవ్వడం ఎంత తీవ్రమైన నేరమో.. దీన్ని కూడా అంతే నేరంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. ఉచిత హామీల పేరుతో జనం నుంచి ఓట్లను కొంటోన్నారంటూ పిటీషనర్లు అభిప్రాయపడ్డారు. దీన్ని సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తన అభిప్రాయాన్ని తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నోటీసులను ఇచ్చింది. గతంలోనూ రెండు సెట్ల పిటీషన్లు దాఖలైన విషయం తెలిసిందే. 2023 ఆగస్టులో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వీ రమణ సైతం దీనిపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచార సమయంలో ఆయా రాజకీయ పార్టీలు ఇచ్చే ఉచిత పథకాల హామీల పట్ల పిటీషన్ వ్యక్తం చేసిన ఆందోళన పరిగణించదగ్గదని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో ముడిపెట్టిన ఇలాంటి హామీలన్నీ కూడా ఆర్థిక భారాన్ని మిగిల్చుతాయని పిటీషన్ ఆందోళన వ్యక్తం చేసినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు ఇచ్చే వాదనలను కూడా వినాల్సి ఉందని అప్పట్లో ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. ఓటర్లను ప్రభావితం చేసే ఉచిత పథకాల హామీలపై పర్యవేక్షించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటూ ఆయన ఇదివరకే అభిప్రాయపడ్డారు. నీతి ఆయోగ్, ఫైనాన్స్ కమిషన్, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అధికార- ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రతినిధులతో ఈ కమిటీని ఏర్పాటు చేయాలని పేర్కొంది. ఉచిత హామీలనేవి తీవ్రమైన ఆర్థిక అంశాలకు సంబంధించినదిగా వ్యాఖ్యానించారు.

## అత్తా కోడళ్ళపై దారుణం.. 48 గంటల్లో నిందితుల అరెస్టు: హోంమంత్రి

అమరావతి: సత్యసాయి జిల్లాలో అత్తా కోడళ్ళపై అత్యాచారం చేసిన ఘటనలో 48 గంటల్లో నిందితులను పోలీసులు పట్టుకున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ ఘటనలో నిందితులకు వేగంగా శిక్ష పడాలని ఆదేశాలు జారీ చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ దీనిపై విచారణ కోసం కేసును ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందులో ప్రజల. భాగస్వామ్యం కూడా కోరుతున్నామన్నారు. తమ ఇళ్ల వద్ద, వ్యాపార వాణిజ్యం సముదాయాల వద్ద పెట్టుకున్న సీసీ కెమెరాలను పోలీసు శాఖకు అనుసంధానం చేస్తే నేర నియంత్రణ సాధ్యం అవుతుందన్నారు. పోలీసులకు ఆయుధాల్లాగే ప్రజలకు మొబైల్ ఫోన్‌లు కూడా ఉన్నాయని, వాటిని వినియోగించి నేర నియంత్రణకు సహకరించాలని హోంమంత్రి అనిత కోరారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అందుకే సత్యసాయి జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనలో అత్యంత వేగంగా విచారణ కోసం దొరికిన 5 గురు నిందితుల్లో ఒకరిపై 37 కేసులు ఉన్నాయని, అతనిపై అత్యాచార ఆరోపణలు కూడా ఉన్నాయని, అందుకే త్వరితగతిన విచారణకు ప్రత్యేక కోర్టుకు అప్పగిస్తున్నామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

సత్యసాయి జిల్లాలో ఈనెల 12 వతారీఖున (దసరా రోజు) అత్తాకోడళ్లు సామూహిక అత్యాచారానికి గురయ్యారని.. సంఘటన జరిగిన 48 గంటల్లోనే పోలీసులు నిందితులను పట్టుకొని రిమాండు విధించారని హోంమంత్రి అనిత తెలిపారు. మహిళల భద్రత విషయంలో ఈ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని, ఆడపిల్లపై నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయం వేసే పరిస్థితి తేవాలని సీఎం చంద్రబాబు సమీక్షలు నిర్వహించారన్నారు. సీసీ కెమెరాలు బద్దలు కొట్టినా వారిని రెండు వందల కిలోమీటర్లు చేజ్ చేసి కొండలు గుట్టల్లో కూడా వెతికి 48 గంటల్లో పట్టుకున్నారని చెప్పారు. వారంతా నేరచరిత్ర కలిగిన వ్యక్తులని.. నిందితుల్లో ముగ్గురు మైనర్లు ఉన్నారని.. వారిలో ఉన్నవారిపైనా చాలా కేసులు ఉన్నాయన్నారు. తప్పనిసరిగా శిక్షపడుతుందనే ఆలోచన వస్తేనే ఇలాంటి కేసులు తగ్గుతాయని హోంమంత్రి అనిత అభిప్రాయపడ్డారు. ఇలాంటి కేసులు వస్తే వాటిని స్పెషల్ కోర్టులకు పంపుతామన్నారు. గత ప్రభుత్వంలో ఒక రిక్రూట్‌మెంట్ ఒక్కటి కూడా జరగలేదని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే కానిస్టేబుల్ రిక్రూట్ మెంట్ చేస్తున్నామన్నారు. దసరా సమయంలో, ఆ తరువాత భనానీల రాక విషయంలోనూ పోలీసులు గొప్పగా పనిచేశారని హోంమంత్రి అనిత కొనియాడారు.



# బుట్టబొమ్మ థై షో గుబులు పుట్టించేలా!

బుట్టబొమ్మ పూజాహెగ్డే మళ్లీ సౌత్ ఇండస్ట్రీకి గ్రాండ్ గా కంబ్యాక్ అవుతోంది. గతం గతహా గా భావించి రెట్టించిన ఉత్సాహంతో రీఎంట్రీ ఇస్తుంది. ముంబై నుంచే చక్రం తిప్పి అవకాశాలు అందుకుంది. బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత మళ్లీ కంబ్యాక్ అవ్వడం అంటే అంత ఈజీ కాదు. కానీ బుట్టబొమ్మ దాన్ని సుసాధ్యం చేసింది. టాలీవుడ్..కోలీవుడ్ లో ఏకంగా టాప్ స్టార్ల సరసనే అవకాశాలు అందుకుని హైలైట్ అయింది. ఇక అమ్మడు సోషల్ మీడియా యాక్టివిటీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఫ్యాషన్ వరల్డ్ లో పూజాహెగ్డే ఓ స్పెషలిస్ట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి ఎంపికలు అమెలో బ్యూటీని అంతకంతకు హైలైట్ చేస్తుంటాయి. కటౌట్ కి తగ్గట్టు కంటెంట్ ని దించుతుంది. సొగసరి ఎంపిక చేసుకునే దుస్తులే



అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. హైట్..వెయిట్ కి తగ్గట్టు అలంకరణ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుం టుంది. డిజైనర్ దుస్తులైనా... సంప్రదాయ వస్త్రాలైనా బుట్ట బొమ్మ ధరించిందంటే ఆ దుస్తులకే వన్నె వచ్చేస్తుంది. తాజాగా బర్త్ డే బాష్ ని జింగిల్ రిసార్ట్స్ లో సెలబ్రేట్ చేసుకుంది. ఈ సందర్బంగా అమ్మడి బ్యూటీని మరోసారి హైలైట్ చేసింది. స్కిన్ టైట్ దుస్తుల్లో అమ్మడు థై షో హైలైట్. జెబ్బల గౌను ఔట్ ఫిట్ లో తళుకులీనిన వైనం వావ్ అనిపిస్తుంది. సొగసరి పాల నురుగుల సౌందర్య అంతే హైలైట్ అవుతుంది. చుట్టూ ఉన్న గ్రీనరీ ఆస్వాదిస్తూ గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకుంది. జంగిల్ మధ్యలో రిసార్ట్స్ స్విమ్మింగ్ పూల్ లో తనలో ప్రకృతి ప్రేమికురాలిని హైలైట్ చేసింది. అమ్మడి ముఖంలో చెరగని చిరునవ్వు అంతే అందాన్ని జోడించింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది.

# ప్రేమలు బ్యూటీకి ఇది పెద్ద ఛాలెంజ్..!

మలయాళంలో ఈమధ్య ఎక్కువ సందడి చేస్తున్న భామ మమితా బైజు. ప్రేమలు సినిమతో తెలుగు ప్రేక్షకులకు కూడా అమ్మడు బాగా దగ్గరైంది. సౌత్ ఆడియన్స్ అంతా కూడా మమితా బైజు ప్రేమలో పడిపోయారు. ప్రస్తుతం తమిళ, మలయాళ భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటుంది. లేటెస్ట్ గా అమ్మడు దళపతి విజయ్ సినిమా ఛాన్స్ అందుకుంది. హెచ్ వినోద్ డైరెక్షన్ లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ సరసన బుట్ట బొమ్మ పూజా హెగ్డే హీరోయిన్ గా నటిస్తుంది. ఆఫ్టర్ బీస్ట్ విజయ్ తో పూజా హెగ్డే క్రేజీ ఛాన్స్ అందుకుంది. ఐతే ఈ సినిమాలో ప్రేమలు భామ మమితా బైజు కూడా నటిస్తుంది. ఈ సినిమా తెలుగు సూపర్ హిట్ సినిమా భగవంత్ కేసరి రీమేక్ గా చేస్తున్నారని టాక్. బాలకృష్ణ లీడ్ రోల్ లో నటించిన భగవంత్ కేసరి సినిమాలో శ్రీ లీల పాత్రను మమితా బైజు నటిస్తుందని



తెలుస్తుంది. బాలయ్య సినిమాలో శ్రీలీల తన నటనతో ఆకట్టుకుంది. సినిమాలో యాక్షన్ సీన్స్ లో కూడా అమ్మడు అదరగొట్టేసింది. ఇప్పుడు ఆ పాత్రలోనే నటిస్తున్న మమితా తన స్పెషాలిటీ చాటాలని చూస్తుంది. మమితా బైజు తన ప్రతి సినిమాలో చేస్తున్న పాత్రలతో సెపరేట్ స్టైల్ ని ఏర్పరచుకుంది. ఐతే ఇప్పుడు శ్రీలీల పాత్రని చేస్తూ సర్ ప్రైజ్ చేస్తుంది. మమితా బైజు యాక్షన్ సీన్స్ ఎలా చేస్తుంది. భగవంత్ కేసరి రీమేక్ కోలీవుడ్ ఆడియన్స్ ని ఎలా అలరిస్తుంది అన్నది చూడాలి. ఇక్కడ బాలయ్య ఇమేజ్ తో పోలిస్తే అక్కడ విజయ్ ఇమేజ్ వేరేలా ఉంటుంది. మరి అలాంటిది భగవంత్ కేసరి సినిమాను తమిళ తంబీలకు నచ్చేలా ఎలాంటి మార్పులు చేస్తారన్నది చూడాలి. ఈ సినిమాలో హీరోయిన్ గా చేస్తున్న పూజా హెగ్డే పాత్ర కన్నా మమితా బైజు ఎలా అలరిస్తుంది అన్న దాని మీద ఆడియన్స్ ఆసక్తికరంగా ఉన్నారు. తను చేసే ప్రతి పాత్రతో ప్రేక్షకులకు దగ్గర అవుతున్న మమితా ఈ సినిమాలో మరోసారి తన మార్క్ నటనతో ఆకట్టుకోబోతుంది. మరి విజయ్, పూజా, మమితా ఈ కాంబో ఆడియన్స్ కు ఎలాంటి ట్రీట్ అందిస్తుంది అన్నది చూడాలి.'




# దేవర.. ఓటీటీలోకి వచ్చేది ఎప్పుడంటే..




దేవర సినిమా ద్వారా మొత్తానికి జూనియర్ ఎన్టీఆర్ ఒక బిగ్గెస్ట్ సక్సెస్ అందుకున్నాడు. మొదటిసారి 500 కోట్ల క్లబ్లో చేరిన చిత్రంగా ఎన్టీఆర్ కు మర్చిపోలేని గుర్తింపుని ఇచ్చింది. ఇక సినిమా రిలీజ్ అయినప్పుడు భిన్నాభిప్రాయాలు వచ్చినప్పటికీ కూడా సినిమా బాక్సాఫీస్ వద్ద బలంగా నిలబడింది పొంది అంటే ఫ్యాన్స్ కూడా ఒక కారణమని చెప్పాలి. ఎన్ని నెగటివ్ కామెంట్స్ వచ్చినా కూడా వాటిని పట్టించుకోకుండా థియేటర్లలో సినిమా చూడండి అని గట్టిగా ప్రమోషన్స్ కూడా చేశారు. దీంతో సినిమాకు దసరా సెలవుల వరకు మంచి కలెక్షన్స్ అయితే వచ్చాయి. ఒకరోజు తగ్గినా మరుసటి రోజు మళ్ళీ కలెక్షన్స్ పెంచుకునే విధంగా దేవర సినిమా కొనసాగింది. దాదాపు అన్ని ఏరియాలలో కూడా ఈ సినిమా అనుకున్న టార్గెట్ ను అయితే పూర్తిచేసుకుంది. ఇక కొన్ని రికార్డులను కూడా తిరగ రాయడం విశేషం. ముఖ్యంగా బాహుబలి మొదటి భాగం రికార్డును కూడా దేవర తెలుగు రాష్ట్రాల్లో బ్రేక్ చేసింది. ఇక ఈవారం కూడా మంచి కలెక్షన్స్ అయితే వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పోటీగా ఎలాంటి సినిమాలు లేవు. కాబట్టి దేవర మరి కొన్ని రోజులు డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాలను అందించే అవకాశం అయితే ఉంది. అయితే ఈ సినిమా ఓటీటీ లోకి ఎప్పుడు వస్తుంది అనే విషయం కూడా గత కొన్ని రోజులుగా వైరల్ అవుతుంది. సినిమా డిజిటల్ హక్కులను నెట్ ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇక వచ్చేవారమే స్ట్రీమింగ్ అవుతుందని కొన్ని రకాల రూమర్స్ అయితే వచ్చాయి. కానీ అందులో నిజం అయితే లేదు. ప్రస్తుతం కలెక్షన్స్ నిలకడగా ఉన్నాయి కాబట్టి ఓటీటీ డీల్ విషయంలో మళ్లీ ఎలాంటి మార్పులు జరగలేదు. ముందుగా చేసుకున్న డీల్ ప్రకారం సినిమాను నవంబర్ 8వ తేదీన ఓటీటీ లో విడుదల చేసే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. అక్కడ కూడా ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశం అయితే ఉంది.

ఇక దేవర సెకండ్ పార్ట్ ఎప్పుడు వస్తుంది అనే విషయం కూడా అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తుంది. దర్శకుడు కొరటాల అయితే ఇప్పటికే సెకండ్ పార్ట్ కు సంబంధించిన కొంత షూట్ సిద్ధంగా ఉందని తెలియజేశాడు. మరిన్ని పవర్ ఫుల్ సీన్స్ సెకండ్ పార్ట్ లో ఉంటాయని కూడా చెప్పాడు. ఇక ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ వార్ 2తో బిజీగా ఉన్నాడు. ఆ సినిమా తర్వాత దేవర 2 గురించి ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. కానీ వీలైనంత త్వరగా సెకండ్ పార్ట్ ను స్టార్ట్ చేయాలని ఎన్టీఆర్ కూడా అనుకుంటున్నాడు.

# దసరా బాక్సాఫీస్.. అసలు సౌండ్ లేదే..




దసరా సెలవుల్లో టాలీవుడ్ లో కొన్ని డిఫరెంట్ సినిమాలు విడుదల అయ్యాయి. రజనీకాంత్ హీరోగా నటించిన 'వేట్టయన్' గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మొదటి రోజు మంచి కలెక్షన్లు రాబట్టినప్పటికీ, ప్రేక్షకుల నుంచి వచ్చిన మిశ్రమ స్పందనతో పాటు పలు కొత్త చిత్రాలు విడుదల కావడంతో రెండవ రోజు వేట్టయన్ వసూళ్లు కాస్త తగ్గాయి. అసలు రజినీకాంత్ సినిమా కలెక్షన్స్ మరీ ఈ రేంజ్ లో తగ్గుతాయని ఎవరు ఊహించలేదు. కానీ మిగతా రోజుల్లో పెరుగుతాయని డిస్ట్రిబ్యూటర్స్ నమ్ముతున్నారు. ఇక గోపీచంద్ మరియు శ్రీను వైట్ల కాంబినేషన్ లో వచ్చిన 'విశ్వం' శుక్రవారం విడుదలైంది. కానీ, ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలో ఫైనాన్షియల్ ఇబ్బందుల కారణంగా ఉదయం షోలను రద్దు చేయాల్సి వచ్చింది. ఇది మాత్రమే కాకుండా, సినిమా రిలీజైన తర్వాత కూడా ప్రేక్షకుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. గోపీచంద్ మరియు శ్రీను వైట్ల కాంబినేషన్ సినిమాకు ఇంతటి దారుణమైన ఓపెనింగ్స్ రావడం ఆశ్చర్యపరిచింది. సక్సెస్ లేక సతమతమవుతున్న ఈ కాంబినేషన్ కు విశ్వం ఏమాత్రం బూస్ట్ ఇవ్వలేకపోతోంది. ఇక మరోవైపు సుధీర్ బాబు నటించిన 'మా నాన్న సూపర్ హీరో' చిత్రం కూడా దసరా సందర్భంగా శుక్రవారం విడుదలైంది. భావోద్వేగ భరితమైన ఈ చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. థియేటర్లలో నలుగురు ప్రేక్షకులు కూడా కనిపించడం కష్టమయ్యేలా సినిమా పరిస్థితి ఉంది. దసరా లాంటి హాలీడే సీజన్ లో కూడా సుధీర్ బాబు సినిమాకు ఇంతటి డిజాస్టర్ ఓపెనింగ్స్ రావడం చాలా షాకింగ్ గా మారింది. ఇక దిల్ రాజు నిర్మించిన 'జనక అయితే గనక' శుక్రవారం సాయంత్రం ప్రీమియర్లతో కాస్త రిస్క్ చేసింది. ప్రేక్షకుల నుంచి వచ్చిన మౌత్ టాక్ పాజిటివ్ గానే ఉన్నా, ప్రీమియర్ షోలకు వచ్చిన అటెండెన్స్ అంతంత మాత్రమే. ఇక యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' మాత్రం దసరా సెలవుల్లో తన జోరు కొనసాగిస్తోంది. సాయంత్రం మరియు రాత్రి షోలకు థియేటర్స్ లో జనాలు గట్టిగానే కనిపించారు. ఇప్పటికే వచ్చిన రిపోర్ట్స్ ప్రకారం ఈ సినిమా వీకెండ్ లో మంచి వసూళ్లు రాబట్టబోతుందని ట్రేడ్ అనలిస్ట్ లు అంచనా వేస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఉన్న పాయింట్ ఏమిటంటే, మంచి అంచనాలు ఉన్నప్పటికీ 'వేట్టయన్', 'విశ్వం', 'మా నాన్న సూపర్ హీరో' లాంటి సినిమాలకు దారుణమైన ఓపెనింగ్స్ వచ్చాయి. ఈ దసరా హాలీడే సీజన్ ను ఏమాత్రం ఉపయోగించుకోలేదు.

# చుక్కల మధ్యలో అందమైన చందమామ!

చుక్కల మధ్యలో చందమామ అందాన్ని వర్ణించడం ఎవరికి సాధ్యం. మిరుమిట్లు గొలిపే నక్షత్రాల మధ్యలో నిండైన చందమామ ఎంతో అందంగా..అద్భుతంగా కనిపిస్తుంది. ఇది ఆకాశంలో కనిపించే చందమామ గురించి. మరి భూలోకంలో అంతటి అందమైన చందమామ ఎవరు? అంటూ ఈ 22 ఏళ్ల బ్యూటీ గురించి మాట్లాడుకోవాలేమో! అవును బాలీవుడ్ యువ నటి సయిమంజ్రేకర్ ఇక్కడ అంతే అందంగా హైలైట్ అవుతుంది. లెహంగా దుస్తుల్లో అమ్మడి బ్యూటీకి ఫిదా అవ్వాల్సిందే. చున్నీ పై ఉన్న చుక్కల డిజైన్ తోనే తానో చుక్కల్లో చందమామలా మెరిసింది. ఓ క్లోజప్ షాట్ లో అచ్చంగా అలాగే హైలైట్ అయింది. చున్నీ వెనుక దాగిన తన అందాన్ని



ఇలా హైలైట్ చేసింది. బ్యూటీ తనలో క్లీవేజ్ అందాలతో మరోసారి మంత్రముగ్ధుల్ని చేసింది. చారడేసి కళ్లు..నుదిటిన వైట్ స్టికర్.. పెదాలపై ఎరుపందం..చెవులకు ధరించిన బుట్టలు ప్రతీది అమ్మడి అందాన్ని అంతకంతకు రెట్టింపు చేసాయి. వివిధ భంగిమల్లో అమ్మడు ఇచ్చిన ఫోజులు అంతర్జాలంలో వైరల్ గా మారాయి.

అమ్మడికి యూత్ లో మంచి ఫాలోయింగ్ ఉంది. ఆ ఫాలోయింగ్ ని ఇలా ఎన్ క్యాష్ చేసుకుంటుంది. ఇక ఈబ్యూటీ బ్యాక్ గ్రౌండ్ గురించి తెలిసిందే. బాలీవుడ్ నటుడు మహేష్ మంజ్రేకర్ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం తండ్రీ-కుమార్తెలిద్దరు ప్రోఫెషనల్ గా దూసుకుపోతున్నారు. తెలుగులో గని సినిమాతో లాంచ్ అయింది. అటుపై 'మేజర్' సక్సెస్ తో బాగా పాపులర్ అయింది. బోయపాటి యాక్షన్ ప్యాక్డ్ చిత్రం స్కందలోనూ నటించింది. కానీ మేజర్ తప్ప మిగిలిన రెండు చిత్రాలు నిరాశనే మిగిల్చాయి.

# చాలా మంది పతితులు... వారిని పట్టించుకోకు..!

2004 ఎరోటిక్ థ్రిల్లర్ 'మర్డర్' విజయం తర్వాత తాను ఎదుర్కొన్న సవాళ్ల గురించి మల్లికా షెరావత్ ఇటీవలి ఇంటర్వ్యూలో మరోసారి ఓపెనైంది. రణ్‌వీర్ అల్లాబాడియా పోడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. మర్డర్ చిత్రం తనకు స్టార్‌డమ్ ని ఇవ్వడమే కాదు.. కష్టాలను కొని తెచ్చిందని తెలిపింది. తాను చాలా కాలంగా కోరుకున్న ఆర్థిక స్వాతంత్రాన్ని పొందగలిగినా కానీ, తనకు పెను సవాళ్లు ఎదురయ్యాయని మల్లిక అంది. ముఖ్యంగా తన బాలీవుడ్ కొలీగ్స్ నుంచి తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నానని గుర్తు చేసుకుంది. మర్డర్ నాకు స్టార్‌డమ్ ఇచ్చింది.. ఆర్థిక స్వాతంత్ర్యం ఇచ్చింది.. కానీ సమస్యల్ని తెచ్చింది! అని మల్లిక వెల్లడించింది. నాకు అవార్డులు గెలవడం ఎప్పుడూ లక్ష్యం కాదు. ముఖ్యంగా ఏదైనా సరైనదా లేక తప్పుగా ఆలోచిస్తున్నానా అనేదానితో సంబంధం లేకుండా నా స్వీయ నిబంధనలపై జీవితాన్ని గడపడం, నిర్ణయాలు తీసుకోవడం అలవాటు. కీర్తి ప్రతిష్ఠలు కేవలం అదనపు భాగ్యం మాత్రమేనని అభిప్రాయపడింది. మర్డర్ అన్నింటినీ మార్చేసింది. నా విషయంలో ప్రజల ప్రవర్తన కూడా వింతగా మారింది. అకస్మాత్తుగా అందరూ నన్ను గుర్తించారు. నాపై వారి వైఖరి మారిపోయింది. అప్పటికి ఆ పేరు చాలా పెద్దది.. అని గుర్తు చేసుకుంది. 2000ల ప్రారంభంలో నటిగా నాకంటూ ఒక



స్పేస్ ని రూపొందించుకున్నాను. కానీ నేటి తరం ఔత్సాహిక నటీమణులు పూర్తిగా భిన్నమైన నిజాలను ఎదుర్కోవలసి ఉంటుంది. సినిమా ఎంత పెద్ద హిట్ అయినా, కంటెంట్ కారణంగా మాత్రమే రెండు వారాలు ఆడుతుంది. 2004 నాటికి భారతీయ సంస్కృతి తనలాంటి నటి కోసం సిద్ధంగా లేదని కూడా మల్లిక అంగీకరించింది. అప్పటి సంస్కృతి నా కోసం సిద్ధంగా లేదు.. అలాగని హత్యకు కూడా సిద్ధంగా లేదు. 2004లో నేను ఉన్న స్థితికి ఇప్పుడు బాలీవుడ్ చేరుకుంది! అని మల్లిక అన్నారు. ఆ సమయంలో నటీమణులు ఒక నిర్దిష్ట ప్రవర్తనా నియమావళిని అనుసరించాలని భావించారు. వారు సిగ్గుపడేవారు.. నేను అందుకు భిన్నంగా ఉన్నాను. దేనినీ మన్నించకుండా ఉన్నాను. మర్డర్‌తో ఒక ఫెమ్మె ఫాటేల్ పరిచయం చేసాను.. అని తెలిపింది. మర్డర్ లో వివాహేతర సంబంధం నడిపే పెళ్లయిన యువతిగా నటించాక.. తన తోటివారి నుంచి తాను ఎదుర్కొన్న కఠినమైన జస్టిస్ గురించి కూడా మల్లిక తెలిపింది. బాలీవుడ్‌లో కొంతమంది పెద్ద పేరున్న నటీమణులు (పేర్లు చెప్పను) తనను అవమానించారని, అది తట్టుకోలేక ఏడ్చేశానని తెలిపింది. ఓదార్పు కోసం తన గురువు మహేష్ భట్‌ను ఆశ్రయించానని మల్లిక తెలిపింది. "నేను ఏడుస్తూ అతడి వద్దకు పరిగెత్తాను.. అతడు నాకు ఏం చెప్పారంటే... బాలీవుడ్‌లో చాలా మంది పతితులు... వారిని పట్టించుకోకు..!" అన్నారు. నాకు జరిగినది ఇదే. చాలా మంది పతితల వల్ల అవమానం జరిగింది. నేను చేసిన బోల్డ్ సీన్స్ చూసి సిగ్గుపడేలా చేయాలనుకున్నారు! అని మల్లిక వెల్లడించింది.



# దామగుండం రాడార్ కేంద్రానికి శంకుస్థాపన చేసిన రాజ్‌నాథ్

పూడూరు: భారత నౌకాదళానికి సంబంధించిన 'వెరీ లో ఫ్రీక్వెన్సీ' (వీఎల్ఎఫ్) కమ్యూనికేషన్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్ రాడార్ కేంద్రానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శంకుస్థాపన చేశారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ ప్రాంతంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, నేవీ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ స్టేషన్ నిర్మాణానికి అటవీ శాఖకు చెందిన 2,900 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న 'ఈస్టర్న్ నావెల్ కమాండ్'కు ఆరు నెలల క్రితమే అప్పగించింది. దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్‌తో పాటు టౌన్‌షిప్ నిర్మాణం కానుంది. ఇందులో పాఠశాలలు, ఆసుపత్రి, బ్యాంక్, మార్కెట్ వంటి సదుపాయాలుంటాయి. నేవీ యూనిట్‌లో సుమారు 600 మంది ఉద్యోగులు, ఇతర సిబ్బంది ఉంటారు. మొత్తంగా ఈ టౌన్‌షిప్‌లో సుమారు 2,500–3,000 మంది నివసించే అవకాశముంది. ఈ ప్రాజెక్టులో భాగంగా దామగుండం రిజర్వ్ ఫారెస్టు చుట్టూ దాదాపు 27 కి.మీ. రోడ్డును నిర్మించనున్నారు. కొత్త వీఎల్ఎఫ్ కేంద్రాన్ని 2027 లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.




# ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లాల్సిందే..

దిల్లీ: ఈ నెల 9న కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, కె.ఆమ్రపాలి, ఎ.వాణీప్రసాద్, డి.రొనాల్డ్‌రాస్, జి.సృజనలకు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్(క్యాట్)లో ఊరట లభించలేదు. పిటిషన్‌పై విచారణ సందర్భంగా క్యాట్ కీలక వ్యాఖ్యలు చేసింది. "ఏపీలో ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతున్నారు. అలాంటి చోటుకు వెళ్లి వారికి సేవ చేయాలని మీకు లేదా? ఐఏఎస్‌ల కేటాయింపులపై డీవోపీటీకి పూర్తి అధికారాలు ఉన్నాయి. స్థానికత ఉన్నప్పటికీ స్వాపింగ్ చేసుకునే అవకాశం గైడ్‌లైన్స్‌లో ఉందా?" అని క్యాట్ ప్రశ్నించింది. వన్ మ్యాన్ కమిటీ సిఫారసులను డీవోపీటీ పట్టించుకోవడం లేదని ఐఏఎస్ అధికారుల తరఫు న్యాయవాది క్యాట్ దృష్టికి తెచ్చారు. సింగిల్‌మెన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా కేంద్రం ఉత్తర్వులు జారీ చేసే ముందు కమిటీ నివేదికను ఇవ్వలేదన్నారు. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న వాకాటి కరుణ, ఆమ్రపాలి, వాణీప్రసాద్, రొనాల్డ్‌రాస్‌లు కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఏపీకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ఏపీలో పనిచేస్తున్న సృజన తెలంగాణకు రావాల్సి ఉంది. ప్రస్తుతం తాము పనిచేస్తున్న రాష్ట్రంలోనే కొనసాగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, కేంద్రం జారీ చేసిన కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. కేటాయింపుల సమయంలో కేంద్రం తమ అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రాష్ట్రాల్లోనే కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనల అనంతరం .. డీవోపీటీ ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. ఏపీకి వెళ్లాల్సిందేనని స్పష్టం చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలు.. కాంగ్రెస్ పరిశీలకులుగా తెలంగాణ నేతలు

దిల్లీ: మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ జాబితాలో తెలంగాణ నుంచి ముగ్గురికి చోటు కల్పించింది.

మహారాష్ట్రలోని 5 డివిజన్లకు 11 మందిని నియమించగా.. వీరిలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క ఉన్నారు. ఝార్ఖండ్ కు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు ఆ పార్టీ సీనియర్ నేతలు తారిక్ అన్వర్, అధీర్ రంజన్ చౌదరిని నియమించారు.

నేడు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనున్న నేపథ్యంలో ఏఐసీసీ పరిశీలకులను నియమించింది.



# దేశ భద్రతకు సంబంధించిన ప్రాజెక్టుపై పోరాటం చేస్తారా?: భారాసపై మండిపడ్డ కిషన్‌రెడ్డి

హైదరాబాద్: తెలంగాణకు గర్వకారణమైన రాడార్ ప్రాజెక్టుపై భారాస, కేసీఆర్ కుటుంబం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మండిపడ్డారు. భారాస అధికారంలో ఉన్నప్పుడే దీనికి సంబంధించిన జీవోలు ఇచ్చారని గుర్తు చేశారు.

భారాస అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరొక మాట మాట్లాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేవీ రాడార్ స్టేషన్‌కు సహకరించాల్సింది పోయి వ్యతిరేకంగా పోరాటం చేస్తామంటున్నారని విమర్శించారు. దేశ భద్రత, సమగ్రతకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారా..? అని నిలదీశారు.

రక్షణ శాఖకు సంబంధించిన షిప్స్‌ను కమ్యూనికేట్ చేసే రాడార్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల తెలంగాణకు ఎంతో పేరు



వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు జిల్లా అటవీ శాఖ నుంచి కేంద్ర పర్యావరణ శాఖ వరకూ అన్ని అనుమతులు పొందిందని చెప్పారు.

# రైలు కిటికీ నుంచి జారిపడ్డ చిన్నారి.. 16 కి.మీ కాలినడకన గాలించి..

కుటుంబంతో కలిసి రైల్లో ప్రయాణిస్తున్న ఓ 8 ఏళ్ల చిన్నారి ఊహించని ప్రమాదానికి గురైంది. తెరిచి ఉన్న ఎమర్జెన్సీ కిటికీ నుంచి జారి కిందపడిపోయింది. అయితే, రైల్వే పోలీసులు వేగంగా స్పందించడంతో చిన్నారి ప్రాణాలు దక్కాయి. రాత్రివేళ 16 కిలోమీటర్ల మేర కాలినడక గాలించి బాలికను రక్షించారు. ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మథుర వెళ్లేందుకు ఓ కుటుంబం తమ 8 ఏళ్ల చిన్నారితో కలిసి రైలెక్కింది. వీరు బోగీలోని ఎమర్జెన్సీ కిటికీ వద్ద ఉన్న సీట్లలో కూర్చుకున్నారు. వెంటిలేషన్ కోసం కొందరు ప్రయాణికులు ఈ విండోను తెరిచారు. మార్గమధ్యంలో ఆ బాలిక ఉన్నట్టుండి కిటికీ నుంచి జారి కిందపడిపోయింది. గమనించిన చిన్నారి తండ్రి వెంటనే లలిత్‌పూర్ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ పోలీసులను ఆశ్రయించారు. అప్రమత్తమైన ఝాన్సీ జీఆర్పీ పోలీసులు.. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్‌తో కలిసి గాలింపు చేపట్టారు. నాలుగు బృందాలుగా విడిపోయి రాత్రివేళ చిమ్మచీకట్లోనే 16 కిలోమీటర్ల మేర కాలినడకన గాలింపు చేపట్టారు.

ఈ క్రమంలోనే పట్టాల పక్కన ఉన్న ఓ చెట్ల పొదల్లో గాయాలతో స్పృహకోల్పోయిన స్థితిలో బాలికను గుర్తించారు. ఆ ప్రాంతానికి రోడ్డు మార్గం లేకపోవడంతో అటుగా వెళ్తున్న గూడ్స్ రైలును ఆపి వెంటనే లలిత్‌పూర్‌కు తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. తన కుమార్తెను కాపాడిన రైల్వే పోలీసులకు ఆ పాప తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను యూపీ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. టీమ్‌వర్క్‌తో చిన్నారి ప్రాణాలను కాపాడిన రైల్వే పోలీసులు, అధికారులను నెటిజన్లు కొనియాడుతున్నారు. రియల్ హీరోలంటూ అభినందిస్తున్నారు.




# తెలంగాణలో.. గ్రూప్-1 పరీక్షలకు తొలగిన అడ్డంకి

హైదరాబాద్: తెలంగాణలో గ్రూప్–1 పరీక్షల నిర్వహణకు అడ్డంకి తొలగిపోయింది. ఈ నోటిఫికేషన్లను సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ నెల 21 నుంచి గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరగనున్నాయి. ప్రిలిమ్స్‌లోని 7 ప్రశ్నలకు తుది 'కీ'లో సరైన జవాబులు ఇవ్వలేదని పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారు. వాటికి మార్కులు కలిపి మళ్లీ జాబితా ఇవ్వాలని కోరారు. వీటిపై విచారణ చేపట్టిన హైకోర్టు పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

# ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెచ్చారు: కేటీఆర్..



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచి అన్నీ రంగాలు కుదేలయ్యాయని బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు అన్నారు. వ్యవసాయ, విద్యా, విద్యుత్ రంగాలు అధ్వానంగా మారాయని బీర్ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గురుకులాల బిల్డింగులకు కనీసం అద్దె చెల్లించలేక విద్యార్థులను రోడ్డుపైకి తెచ్చారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ ట్విటర్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్ ట్వీట్ ఇదే..** "బడా భాయ్ (ప్రధాని మోదీ) రాష్ట్రంలో పత్తి రైతులకు పట్టాభిషేకం జరుగుతుంటే చోటా భాయ్ (రేవంత్ రెడ్డి) పాలనలో మాత్రం పత్తి రైతులు చిత్తు అయ్యారు. గుజరాత్‌లో మద్దతు ధరకు మించి క్వింటా పత్తి ధర రూ.8,257 పలుకుతోంది. కానీ తెలంగాణలో క్వింటా ధర కేవలం రూ.5వేలేనా?.

రెండేళ్ల కిందట పత్తి క్వింటా ధర 10 నుంచి 15 వేల వరకూ పలికింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి మారింది. మార్కెట్‌కు దిగుబడి వచ్చినా సీసీఐ కేంద్రాలెక్కడ?. ఇందిరమ్మ రాజ్యమని దళారుల రాజ్యం తెస్తారా?. నిన్న పెట్టుబడి సాయం అందించలేదు, నేడు కష్టించి పండించినా పంట కొనుగోలు చేయరా?. పత్తి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతోంది. ముందుచూపు లేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వల్లే పత్రి రైతులకు రాష్ట్రంలో అన్యాయం జరుగుతోంది.

# రాష్ట్ర పక్షి పాలపిట్టను బంధించిన జగ్గారెడ్డి.. వన్యప్రాణి సంరక్షకులు ఫైర్



సంగారెడ్డి : కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి.. మరో వివాదంలో చిక్కుకున్నారు. దసరా పండుగ రోజున రాష్ట్ర పక్షి పాలపిట్టను బంధించారు.

సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన దసరా వేడుకల్లో ఓ బోనులో పాలపిట్టలను బంధించి.. ప్రజలకు బహిరంగంగా జగ్గారెడ్డి చూపించారు. ఈ దసరా వేడుకల్లో జగ్గారెడ్డితో పాటు ఆయన భార్య, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా రెడ్డి, కూతురు జయా రెడ్డి, కుమారుడు భరత్ సాయి రెడ్డి కూడా పాల్గొన్నారు. వీళ్లు కూడా పాలపిట్టలను తమ చేతుల్లో పట్టుకుని వేదికపై నిల్చున్నారు. ఇలా వన్యప్రాణులను బంధించడం వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 ప్రకారం నేరం అని వన్యప్రాణి సంరక్షకులు పేర్కొంటున్నారు. ఇక జగ్గారెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు పాలపిట్టలను బంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చాలా మంది జగ్గారెడ్డి కుటుంబ సభ్యులను తీవ్రంగా విమర్శిస్తున్నారు.

తెలంగాణ వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ సుభద్రా దేవికి వన్యప్రాణి సంరక్షకులు ఫిర్యాదు చేశారు. దసరా పండుగ నేపథ్యంలో పాలపిట్టలను బంధించొద్దని తెలంగాణ అటవీ శాఖ పౌరులను హెచ్చరించినప్పటికీ, ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

# షాపు అక్కడ.. ఊపు ఇక్కడ!

**- ఏపీ మద్యం దుకాణాల్లో ఉమ్మడి జిల్లా వ్యాపారుల లక్కు - సరిహద్దు జిల్లాల్లో 40 శాతం దుకాణాలు కైవసం**



ఖమ్మం: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మద్యం టెండర్లు జరిగితే సరిహద్దు జిల్లాలోని మద్యం వ్యాపారులు పాల్గొంటారు. గతేడాది తెలంగాణలో జరిగిన మద్యం టెండరు ప్రక్రియలో ఏపీకి చెందిన మద్యం వ్యాపారులు జోరుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మద్యం టెండర్లలో పాల్గొన్నారు. అదేస్థాయిలో మద్యం దుకాణాలు దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాలకు టెండరు ప్రక్రియ జరిగింది. ఏపీలో కూడా ప్రభుత్వం మారింది. పారదర్శకంగా మద్యం వ్యాపారం జరుగుతుందని ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మద్యం వ్యాపారులు ఏపీలో మకాం వేశారు. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి ఏపీలో మద్యం టెండర్లు వేసేందుకు వెళ్లిన వారికి అక్కడి వ్యాపారులు సహకారం అందిస్తున్నారు.

**సరిహద్దు జిల్లాలో 40శాతం దుకాణాలు కైవసం..** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఎన్టీఆర్, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలు ఉన్నాయి. వీటిలో ఎన్టీఆర్ జిల్లా ఖమ్మం జిల్లా సరిహద్దుతో, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దులో ఉన్నాయి. సోమవారంతో ఏపీలో మద్యం టెండర్లు ప్రక్రియ ముగిసింది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా, ఇక పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలోని మద్యం దుకాణాల్లో 40శాతం దుకాణాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా మద్యం వ్యాపారులు దక్కించుకున్నారు.

# నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : మంత్రి తుమ్మల



ఖమ్మం కమాన్‌బజార్: ఖమ్మం నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కార్పొరేషన్ 46వ డివిజన్‌లో రూ.కోటితో నిర్మించనున్న స్ట్రాంగ్ వాటర్ డ్రైన్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లడుతూ.. గతంలో తాను మంత్రిగా ఉన్నకాలంలో నగరానికి కోట్లది రూపాయాలు తీసుకువచ్చి అభివృద్ధి చేశాను అని అన్నారు. రాబోయే కాలంలో అన్నీరకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ప్రకటించారు. అనంతరం షాదీఖానాలో జరిగిన కార్యక్రమానికి హాజరై మసీదులకు రూ.లక్ష చొప్పున చెక్కలను అందజేశారు. ఈ కర్యక్రమంలో నగర మేయర్ పి. నీరజ, జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్, కమిషనర్ అభిషేక్ అగస్త్య పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com